
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 9 నవంబరు 2025



నాగులాపల్లిలో శూలాల పండుగ రేపు

- శూలధారణతో మొక్కులు చెల్లించుకోవడానికి వీరశైవులు సన్నద్ధం
- ప్రత్యేక ఆకర్షణగా 1001 ఇనుప చువ్వల సుబ్రహ్మణ్య శూలం

- 8లో



కూరగాయాలు

మార్కెట్‌లో మండుతున్న ధరలు

- రెండున్నర నెలల నుంచి వర్షాలతోపాటు ఇటీవల తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలు
- బాగా తగ్గిపోయిన దిగుబడులు
- కార్తీక మాసం కావడంతో మరింత పెరిగిన డిమాండ్
- గత నెలతో పోలిస్తే రెట్టింపు అయిన ధరలు
- 'సెంచరీ' కొట్టిన చిక్కుడు, బీన్స్
- కిలో రూ.60కిపైనే వంగ, బీర, బెండ, దొండ కాయలు, క్యారట్
- కానరాని ఆకుకూరలు



చోడవరం/ అనకాపల్లి టౌన్/ నర్సీపట్నం/ ఎలమంచిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): **రెండున్నర నెలలపాటు తరచూ వర్షాలు కురవడంతోపాటు గత వారం సంభవించిన 'మొంథా' తుఫాన్‌తో కూరగాయ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మరోవైపు కార్తీక మాసం కావడంతో కూరగాయల వినియోగం పెరిగింది. దీంతో ప్రస్తుతం కూరగాయ ధరలు చుక్కలను తాకుతున్నాయి. నెల రోజుల క్రితం ధరలతో పోలిస్తే... కొన్ని రకాల కూరగాయల రేట్లు వంద శాతం పెరిగాయి. దీంతో నెలవారీ కూరగాయ ఖర్చులు రెట్టింపు అయ్యాయని సామాన్య వినియోగదారులు వాపోతున్నారు.**



తుఫాన్ వర్షాలకు పాడైన ఆనపకాయలు

వాస్తవానికి ప్రతి ఏటా కార్తీక మాసం నుంచి కూరగాయల దిగుబడి పెరుగుతూ వుంటుంది. ఫిబ్రవరి వరకు అందుబాటు ధరల్లో వుంటాయి. కానీ ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు విభిన్నంగా వుండడంతో ఆ ప్రభావం కూరగాయల సాగుపై పడింది. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వర్షాలు సరిగా పడకపోవడంతో కూరగాయ పంటలు ఎండిపోవడం, లేదా దిగుబడి తగ్గడం జరిగింది. తరువాత ఆగస్టు మూడో వారం నుంచి తరచూ భారీ వర్షాలు కురుస్తుండడంతో కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. నవంబరు నుంచి కూరగాయల దిగుబడి వచ్చేలా రైతులు ఆగస్టు/ సెప్టెంబరు నెలల్లో విత్తనాలు వేయడం, నారు నాటడం వంటి పనులు చేస్తుంటారు. కానీ ఈ ఏడాది ఆయా నెలల్లో కుండపోతగా వర్షాలు పడడంతో కూరగాయ పంటలు వేయడానికి వాతావరణం అనుకూలించలేదు. దీంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. వేసిన కూరగాయ పంటలు సైతం వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా ఇటీవల సంభవించిన తుఫాన్ ప్రభావంతో కూరగాయ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాలు ముంపునకు గురవడం, ఎక్కువ రోజులో నీరు నిల్వ వుండడంతో వంగ, బీర, బెండ, ఆనప, దోస, తదితర పంటల మొక్కలు చనిపోయి, ఎండిపోయాయి. ఫలితంగా కూరగాయ దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ఆ ప్రభావం ఇప్పుడు వినియోగదారులపై పడింది. నెల రోజుల క్రితంతో పోల్చి చూస్తే ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగిపోయాయి. జిల్లా ప్రజలు అధికంగా వినియోగించే బీర, బెండ, వంగ, దోస, దొండ, టమాటా, చిక్కుడు, బరబాటి, ఆనప ... మిగతా 8వ పేజీలో

అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం మార్కెట్‌లలో కూరగాయల ధరలు నెల రోజుల క్రితం, ప్రస్తుతం ఇలా ఉన్నాయి

కూరగాయ	నెల క్రితం కిలో (రూ.)	ప్రస్తుతం కిలో (రూ.)
వంకాయలు	30-40	60-80
బీరకాయలు	35-40	60-80
బెండకాయలు	40	60-70
దొండకాయలు	35	50-60
చిక్కుడుకాయలు	80	100
ఆనపకాయ	15	25-35
బీన్స్	80	100
క్యాబేజీ	30	40
కాలిఫ్లవర్	20	30-40
క్యారట్	40	60-70
బీట్ రూట్	40	50-60
ఉల్లిపాయలు	20	25
మునగకాయలు	60	100
బంగాళాదుంపలు	20	25
పచ్చిమిర్చి	60	40-50
టమాటా	40	30

ఇసుక మాఫియా

అధికారంలో ఉన్న పార్టీల నేతలతో చెట్టపట్టాల్

- 'ఉచితం' మాటున నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు
- ప్రభుత్వ డిపోల్లో కన్నా తక్కువ రేటుకు విక్రయం
- అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండదండలు
- చర్యలకు వెనుకాడుతున్న అధికారులు
- అమ్మకాలు లేక వెలవెలబోతున్న అధికారిక స్టాక్ పాయింట్లు



అనకాపల్లి సమీపంలో ఖాళీగా వున్న ఇసుక పాయింట్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

వర్షాకాలం ముగియడంతో ఇసుకాసురులు సహజవనరుల దోపిడీని మొదలుపెట్టారు. నదులు, గెడ్డల్లో వరద తగ్గుముఖం పట్టి, ఇసుక మేటలు బయటపడడంతో తవ్వకాలకు తెగబడుతున్నారు. ఏ పార్టీ అధికారంలో వున్నా.. ఇసుక దోపిడీ మాత్రం ఆగడంలేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానికి తూట్లు పొడుస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం రవాణా చార్జీలు మాత్రమే తీసుకుని గోదావరి నది నుంచి ఇసుకను తీసుకువచ్చి ఉచితంగా అందజేయడానికి డిపోలు ఏర్పాటు చేయగా, అక్రమార్కులు స్థానికంగా ఉన్న గెడ్డలు, నదుల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుపుతూ దర్జాగా అమ్ముకుంటున్నారు. దీంతో ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ పాయింట్లు వెలవెలబోతున్నాయి.

జిల్లాలోని నదుల్లో తగినంత ఇసుక నిల్వలు లేకపోవడంతో ఇసుక రీచ్‌లకు పర్యావరణ శాఖ అనుమతి ఇవ్వలేదు. అయితే జిల్లా వాసుల భవన నిర్మాణాలు, ఇతర కట్టడాల పనులకు గోదావరి నది నుంచి ఇసుకను రప్పించి, వివిధచోట్ల ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇసుక తవ్వకాలు, రవాణా, విక్రయ బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. వీరు రవాణా చార్జీలు, సీనరేజీ చార్జీలు మాత్రమే వేసుకుని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇసుక విక్రయించాలి. గోదావరి నదిలో ఇసుక రీచ్‌ల నుంచి జిల్లాలోని ఆయా స్టాక్ పాయింట్లకు వున్న దూరాన్నిబట్టి టన్నుకు రూ.700 నుంచి రూ.900 వరకు ధర నిర్ణయించింది. వైసీపీ హయాంలో ఇదే ఇసుకను టన్ను రూ.1,450కి విక్రయించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. దీంతో పోలిస్తే కూటమి ప్రభుత్వం చాలా తక్కువ రేటుకు ఇసుకను అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే వైసీపీ హయాంలో ఇసుక మాఫియా ఆ పార్టీ నేతలతో కుమ్మక్కై, జిల్లాలోని అన్ని నదుల్లో ... మిగతా 8వ పేజీలో



చోడవరం మండలంలో అమ్మకాలు జరక్క... కొండలా పేరుకుపోయిన ఇసుక

నాసిరకంగా బడి భోజనం

రుచీపచీ లేని కూరలు, చారు

- అన్నంలో పెంకు పురుగులు
- అరకొరగా భోజనం చేస్తున్న విద్యార్థులు
- నిర్వాహకులకు చెప్పినా పట్టించుకోవడం లేదంటున్న హెచ్‌ఎం



అన్నంలో పెంకు పురుగులు ఉన్నాయని టీచర్‌కు ఫిర్యాదు చేసిన విద్యార్థిని



కూర బాగోలేకపోవడంతో చారుతో అన్నం వడ్డించుకున్న విద్యార్థినులు

నర్సీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): **స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చాలా నాసిరకంగా వుందని, అన్నంలో పురుగులు వుంటున్నాయని, తినలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూను ఇక్కడ అమలు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని అల్లు రామ సంతోషి అన్నంలో కనిపించిన పెంకు పురుగులను ఉపాధ్యాయుడుకి చూపించి, భోజనం బాగుండడంలేదని** ... మిగతా 8వ పేజీలో

మెగా సిటీగా విశాఖ

ఇటు అనకాపల్లి నుంచి అటు విజయనగరం వరకూ విస్తరణ

- రాంబిల్లి నుంచి అనకాపల్లి, కొత్తవలస మీదుగా భోగాపురం వరకూ సెమీ రింగ్‌రోడ్డు నిర్మాణం ప్రతిపాదన
- అధ్యయనానికి కన్సల్టెంట్ నియామకం
- నివేదిక వచ్చిన వెంటనే డీపీఆర్ తయారీ
- ఐటీ, టూరిజం కారిడార్‌గా అభివృద్ధి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు చిన్న మత్స్యకార గ్రామమైన విశాఖపట్నం ఇప్పుడు మెగా సిటీగా మారబోతోంది. ఇంతింతై వటుడింతై...అనే చందంగా పంచాయతీలు, మునిసిపాలిటీలు, జిల్లాలను తనలో కలుపుకొంటూ వెళుతోంది. కార్పొరేషన్‌గా ఉండే విశాఖపట్నం పక్కనున్న గాజువాక, భీమిలి, అనకాపల్లి మునిసిపాలిటీల విలీనంతో మహా విశాఖ నగర పాలక సంస్థగా మారింది. ఇప్పుడు అనకాపల్లి నుంచి విజయనగరం వరకూ విస్తరించి మెగా సిటీగా తయారు కానుంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అమరావతిలాగే తిరుపతి, విశాఖలను మెగా సిటీలు చేయాలనేది ప్రభుత్వం ఆలోచన. ఈ దిశగా ఇప్పటికే విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) కొన్ని నిర్ణయాలు తీసుకొంది. రాంబిల్లి నుంచి అనకాపల్లి, కొత్తవలస మీదుగా భోగాపురం వరకు సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి డీపీఆర్ తయారుచేస్తోంది. కర్ణాటకకు చెందిన ఓ సంస్థకు అధ్యయనం చేసే పని అప్పగించింది. సుమారు 90 కి.మీ. పొడవున వచ్చే ఈ సెమీ రింగ్ రోడ్డు పూర్తిగా గ్రీన్ ఫీల్డ్ రహదారిగా నిర్మించాలనేది యోచన.

ఐటీ, పర్యాటకం కీలకం

అనకాపల్లి జిల్లా పారిశ్రామికంగా పరుగులు తీస్తోంది. ఆర్సెలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ హబ్, రాంబిల్లిలో నేవీ ప్రత్యామ్నాయ స్థావరం వంటివి కీలకంగా మారాయి. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్, భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతున్నాయి. వీటిన్నింటినీ కలుపుతూ విశాఖను మెగా సిటీ చేయాలనేది ఆలోచన. విశాఖపట్నం మీదుగా ఇప్పటికే జాతీయ రహదారి ఉంది. నగర ప్రజల కోసం మెట్రో రైలు ప్రాజెక్టుకు అడుగులు పడుతున్నాయి. నగరంలోకి భారీ వాహనాలు రాకుండా అనకాపల్లి నుంచి అలా వెళ్లిపోవడానికి ఆనందపురం వరకూ మరో జాతీయ రహదారిని నిర్మించారు. హైదరాబాద్‌లా విశాఖకు పూర్తిస్థాయి రింగ్ రోడ్డు నిర్మాణానికి కొండలు, సముద్రం అడ్డంకిగా ఉన్నందున అర్ధ చంద్రాకారంలో సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇది ఎక్కడ కూడా ... మిగతా 8వ పేజీలో

డీపీఆర్ తయారుచేస్తాం



రాంబిల్లి నుంచి భోగాపురం వరకు సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన అధ్యయనం కోసం కన్సల్టెంట్‌ను నియమించాం. ఆ మార్గం ఎలా ఉండాలి?, ఎటువైపు తీసుకువెళ్లాలి?...అనే అంశాలపై నివేదిక వస్తుంది. దాని ప్రకారం డీపీఆర్ తయారు చేస్తాం. ఇది త్వరగానే కార్యరూపంలోకి వస్తుంది.

- ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

త్వరలో అధునాతన వైద్యం

అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్

- డయాలసిస్, బర్న్, హైరిస్క్ వార్డులు
- ఆధునిక ఎక్స్‌రే ప్లాంట్, అల్ట్రాస్కాన్
- ఈ నెలాఖరుకు భవనం అప్పగించనున్న కాంట్రాక్టర్
- వైద్య పరికరాలు అమర్చిన వెంటనే సేవలు ప్రారంభం



తుది దశకు చేరిన క్రిటికల్ కేర్ బ్లాక్ భవన నిర్మాణం

అనకాపల్లి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): **స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో 50 పడకలతో నిర్మితమవుతున్న క్లిష్టతర వ్యాధుల సంరక్షణ విభాగం (క్రిటికల్ కేర్ బ్లాక్-సీసీబీ) ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నది. దీనిని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.22.25 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.15 కోట్ల వరకు భవన నిర్మాణానికి ఖర్చు చేయగా రూ.7 కోట్లతో అధునాతన వైద్య పరికరాలను సమకూరుస్తున్నారు. సీసీబీలో డయాలసిస్ యూనిట్, బర్న్‌వార్డు, హైరిస్క్ వార్డు, ఆపరేషన్ థియేటర్లు వుంటాయి. ఎక్స్‌రే ప్లాంట్, అల్ట్రాస్కాన్ వంటి పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. భవనం మొత్తానికి ఏసీ సదుపాయం వుంది.**

జాతీయ రహదారిపైన, పరిశ్రమల్లో సంభవించిన ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారిని తొలుత అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకువస్తుంటారు. అయితే ఇక్కడ అధునాతన వైద్య పరికరాలు, సూపర్ స్పెషాలిటీ వైద్యులు లేకపోవడంతో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి, విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు. దీనివల్ల సకాలంలో వైద్యం అందక పలువురు మృత్యువాత పడుతున్నారు. దీనిని నివారించడానికి, క్షతగాత్రులకు ఇక్కడే మెరుగైన వైద్యం ... మిగతా 8వ పేజీలో

స్పీకర్ సంకల్పం.. రైతుల్లో ఆనందం



రోడ్డు నిర్మాణం కాకముందు ఇలా..



తారు రోడ్డు నిర్మించిన తరువాత ఇలా..

- గిడుతూరు-సుంకపూరు మధ్య బీటీ రోడ్డు నిర్మాణం
- రూ.1.8 కోట్లు మంజూరు చేయించిన అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెండు మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజల చిరవాంఛ ఎట్టకేలకు నెరవేరింది. మండలంలోని గిడుతూరు నుంచి పక్కనే వున్న కోటవురట్ల మండలం సుంకపూరుకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. ఇంతవరకు ఈ రెండు గ్రామాల మధ్య కనీసం మెటల్ రోడ్డు కూడా లేదు. స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో ఏకంగా తారు రోడ్డు ఏర్పాటైంది. గిడుతూరు-సుంకపూరు మధ్య 2.5 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి రూ.1.8 కోట్లు మంజూరు చేయించారు. గత ఏడాది డిసెంబరు రెండో తేదీన రోడ్డు నిర్మాణ పనులకు అయ్యన్నపాత్రుడు శంకుస్థాపన ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు

ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- కనీస వేతనాలు అమలు చేయాలి
- రాష్ట్ర మహాసభలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ పి.గోపీమూర్తి

-వార్త మెయిన్ ఎడిషన్ 3వ పేజీలో

3 నెలల తర్వాత వినాయక నిమజ్జనం!

▸ ఎంజేపురంలో వింత ఆచారం



వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు

అచ్యుతాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను మూడు నుంచి 11 రోజుల్లో నిమజ్జనం చేస్తారు. కానీ మండలంలోని ఎంజేపురంలో మూ డు నెలలపాటు పూజలు నిర్వహించి, కార్తీక పౌర్ణమి తరువాత వచ్చే శని వారంనాడు నిమజ్జనం చేస్తుంటారు. ఇక్కడి ప్రత్యేకతకు సంబంధించి గ్రామపెద్దలు చెబుతున్న వివరాలిలా వున్నాయి. ఏటా వినాయక చవితి సందర్భంగా నవరాత్రిళ్ల ఉత్సవాలు నిర్వహించి, మహలక్ష్మి అమ్మవారి ఆలయం పక్కనున్న చెరువులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేవారు. అయితే కొంతకాలం క్రితం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి చెరువు ఎండిపోయింది. దీంతో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి వీలుకాలేదు. వర్షాలు కురిసి, చెరువు నిండిన తరువాతే నిమజ్జనం చేయా లని, అప్పటి వరకు వినాయకుడికి నిత్య పూజలు చేయాలని గ్రామస్థులు నిర్ణయిం చారు. తరువాత వర్షాలు కురిసి కార్తీక పౌర్ణమినాటికి చెరువు నిండింది. అనంతరం వచ్చిన శనివారంనాడు వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. ఆ తరువాత వినాయక చవితికి ఒక్క ఏడాది కూడా చెరువు ఎండిపోలేదు. శనివారం రాత్రి వినాయక విగ్రహాన్ని గ్రామంలోని అన్ని వీధుల్లో భారీ ఎత్తున ఊరేగించారు. నిమజ్జనం చేసేసరికి ఆదివారం తెల్లవారుజాము అవుతుందని గ్రామస్థులు తెలిపారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శనివారం ఉదయం వినాయ కుడిని దర్శించుకొని పూజలు చేశారు.

లంకధర్మవరంలో లో ఓల్టేజీ సమస్య పరిష్కారం

అచ్యుతాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : లంకధర్మవరం వాసులకు చిర కాలంగా ఉన్న లో ఓల్టేజీ సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. ఇళ్లలోని లైట్లు సరిగ్గా వెలగక, ఫ్యాన్లు పూర్తిస్థాయిలో తిరగక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. లో ఓల్టేజీ కారణంగా పలువురి ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు తదితరాలు ఎప్పటికప్పుడు కాలిపోతుండడంతో నష్టపోయేవారు. ఈ సమస్యను దీర్ఘకాలంగా అధికారుల దృష్టికి తీసుకు వెళుతున్నా ఫలితం లేకపోయేది. గత వైసీపీ పాలనలో ఎవరికి ఫిర్యాదులు చేసినా పట్టించుకునేవారు కాదు. దీంతో ప్రస్తుత ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ దృష్టికి గ్రామస్థులు ఈ సమస్యను తీసుకు వెళ్లారు. దీంతో ఆయన గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఏఈ శ్రీనివాసరావు శనివారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను గ్రామంలో ఏర్పాటు చేశారు. దీంతో ఎట్టకులకు సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామస్థులంతా కలిసి ఏఈ శ్రీనివాసరావును శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు లంక ఆదినారాయణ, గొర్లె నూకరాజు, పప్పు గణేష్, గొర్లె చిరంజీవి, లంక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట.. రాళ్ల బాట

▸ అభివృద్ధికి దూరంగా కాలనీ ▸ పట్టణంలో ఉన్నా పట్టని అధికారులు ▸ అస్తవ్యస్త రోడ్లు, డ్రైనేజీలతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు





కొత్తపేటలో రాళ్లు తేలి ఉన్న రహదారి

ఎలమంచిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్తపేట కాలనీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి గురవుతోంది. ఇక్కడ రోడ్లు, డ్రైనేజీ కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలమంచిలిలో ఈ ప్రాంతం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుంది. ఇక్కడ చారిత్రాత్మక సీతారాముల ఆలయం, రామలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయాలు ఉన్నాయి. అలాగే, ప్రైవేటు పాఠశాలలు, సెంట్రల్ బ్యాంకు బ్రాంచి కార్యాలయం వంటివి కూడా సాగుతున్నాయి. దీంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రముఖులతో పాటు కర్షకులు ఉన్న ప్రాంతం ఇది. ఈ కాలనీకి ప్రధాన రోడ్డు ఆలయాల ముందు నుంచి ఉంటుంది. ఎక్కడికక్కడ రాళ్లు తేలి ఉండడంతో ఇటు స్థానికులతో పాటు ఆలయాలకు వచ్చే భక్తులు అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు. పాత రామాలయం సమీపంలో ఉన్న రోడ్డుకు ఇరుపక్కలా వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ కారణంగా అంటువ్యాధుల భయం నివాసితులను వెంటాడుతోంది. పారిశుధ్య పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని అక్కడి వారు వాపోతు న్నారు. తమ సమస్యలు ఎవరికి విన్నవించినా పరిష్కారం కానరావడం లేదని పేర్కొంటున్నారు. కూటమి నాయకులైనా ఇక్కడి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులతో పాటు పలువురు భక్తులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన 'ప్రగడ'

▸ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కోరినట్టు స్థానిక విలేకరులకు వివరణ



చంద్రబాబుతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

అచ్యుతాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మంగళగిరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎలమంచిలి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విన్నవించినట్టు ఇక్కడి విలేకరులకు తెలిపారు. అలాగే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురానికి ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరానని వెల్లడించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కొండకర్ల పాఠశాల విద్యార్థిని

అచ్యుతాపురం/రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అండర్- 14 కబడ్డీ పోటీల సెలక్షన్స్‌లో కొండకర్ల ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని పి.కావ్య అద్భుతంగా రాణించి ఎంపికైంది. గాజువాకలో శుక్రవారం ఈ ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. ఈనెల 26 నుంచి కృష్ణా జిల్లాలో మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో సదరు విద్యార్థిని ఆడనుందని హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, పీడీ ఉప్పాడ రాము తెలిపారు. ఈ సందర్భంగా కావ్యను ఉపాధ్యా సిబ్బంది అభినందించి ముున్ముందు మరిన్ని పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

'మా ఊరి వెంకన్న' పోస్టర్ ఆవిష్కరణ



సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

మునగపాక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత కళాకారులు నిర్మించిన 'మా ఊరి వెంకన్న' చిత్రం థియేటర్‌లో రిలీజ్ వరకు వచ్చిందంటే అదే గొప్ప విజయమని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. ఇక్కడి వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో శనివారం సినిమా ప్రీ రిలీజ్, పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగస్థల నటులు పుష్కలంగా ఉన్న మునగపాక నుంచి దర్శక, నిర్మాతలు కూడా ముందుకు రావడం శుభపరిణామంగా పేర్కొన్నారు. వైసీపీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ఈ గ్రామం నుంచి సినిమాలు కూడా రూపుదిద్దుకోవడం సంతోషకరమన్నారు. ఎంపీటీసీ సభ్యుడు సూరిశెట్టి రమణ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, పెంటకోట విజయ్, దిమ్మల అప్పారావు, బోడకుర్తి గణేష్, దాడి ముసిలినాయుడు, కాండ్రేగుల జగ్గారావు, దర్శక, నిర్మాతలు కోరుకొండ గోపి, వెలవలపల్లి కోటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

హరిపాలెంలో నేత్రపర్వంగా అయ్యప్ప అంబలం పూజ



హరిపాలెంలో అయ్యప్ప అంబలం దృశ్యం

అచ్యుతాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : హరిపాలెంలోని రామాలయం వద్ద గల లక్ష్మీగణపతి ఆలయ అయ్యప్ప స్వామి పీఠం ఆధ్వర్యంలో శనివారం రాత్రి అంబలం పూజను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. తొలుత అరటి డొప్పలతో స్వామివారి మండపాన్ని ఏర్పాటు చేసి ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం మాలధారణ చేసి భక్తులు చక్కని పాటలను పాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలతో పాటు వివిధ గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

నేడు బండిమాంబ జాతర



ఎలమంచిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఏటికొప్పాక బండిమాంబ జాతర ఆదివారం ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేపట్టింది. వేకువజామున అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఈ వేడుకకు భారీగా భక్తులు తరలి రానున్నారు. జాతరను పురస్కరించుకుని ఆలయ పరిసరాలతో పాటు గ్రామ ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసి సెట్టింగ్‌లు, విద్యుద్దీపాలంకరణ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రాత్రికి వరహానది సమీపంలో భారీగా బాణసంచా కాల్చనున్నారు. రాత్రికి పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

సొంత నిధులతో వీధిలైట్లు ఏర్పాటు

మునగపాక, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి) : ఇచ్చిన హామీ మేరకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ రైతు కళ్లాల రోడ్డు మార్గంలో విధి లైట్లు ఏర్పాటు చేసి తన సేవాభావం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఇక్కడ జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మునగపాకలో సుమారు 12 ప్రాంతాల్లో రైతులు పశువుల పెంపకం, పొలం పనులు చీకటిపడే వరకు సాగిస్తూనే ఉంటారన్నారు. రాత్రి సమయంలో ఇళ్లకు వచ్చే సమయంలో పాముకాటు వంటి ప్రమాదాలకు గురవుతున్నందున తన సొంత నిధులతో వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సాయికృష్ణకు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొడ్డి నూకరాజు, దాడి రామనాగఅప్పారావు, సూరిశెట్టి దుర్గునాయుడు, తదితరులు అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పెంటకోట విజయ్, దాడి శివ, బీలా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తోనే అభివృద్ధి

▸ జేఎస్‌టీయూ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దీక్షితులు

▸ ఘనంగా ముగిసిన శ్రీప్రకాష్ రిమ్‌జిమ్ వేడుకలు



విజేతలతో అతిథి డాక్టర్ జీవీఎస్‌ఆర్.దీక్షితులు, సీహెచ్.విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపర్చుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందని జేఎస్‌టీయూ వైస్ ప్రిన్సిపాల్ డా క్టర్ జీవీఎస్‌ఆర్ దీక్షితులు అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో గత మూడు రోజులుగా నిర్వహించిన రిమ్‌జిమ్-2025 వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. అతిథులుగా డాక్టర్ దీక్షితులతోపాటు ది హిందు గ్రూప్ (ఎస్ అండ్‌డీ) వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ ఆర్నాల హాజరయ్యారు. ఈ సందర్భంగా దీక్షితులు మాట్లాడుతూ సాంకేతిక పురోగతితో ప్రపంచ పోకడలు మా రుతున్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల మనసెరిగి వారికి నచ్చినదారిలో పయనించడానికి ప్రోత్సహించాలన్నారు. ఇలా అయితే వారికి భవిష్యత్తు ఉంటుందన్నారు. శ్రీధర్ ఆర్నాల మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల్లో విలువలతోకూడిన ఆలోచన శక్తి, ఆసక్తి లక్ష్యసాధనకు తోడ్పడతాయన్నారు. మ న గ్రామం, స్కూల్, పరిసరాలు, పర్యావరణ పరిరక్షణ, నైతిక విలువలు తదితర అంశాలపై దృష్టిపెట్టాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిధ విభాగాల్లో నిర్వహించిన 31 రకాల ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అతిథులకు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ జ్ఞాపికలు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రోగ్రామ్ కన్వీనర్ నీలాదేవి, అకడమిక్ ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినుల గీతాలాపన

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం



చినదొడ్డిగల్లు గ్రంథాలయ ఆవరణలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

నక్కపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో తుని ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శనివారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రంథాలయ ఆవరణలో వ్యర్థాలు, పిచ్చితుప్పలను తొలగించారు. మొక్కలు నాటారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలకు సంబంధించి లైబ్రేరియన్ కె.జనార్దన్ వివరించారు. క ళాశాల ప్రిన్సిపాల్ దీప్తి, వైస్ ప్రిన్సిపాల్ మనియా పర్యవేక్షణలో శ్రమదానం చేశారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్త గట్టెం నానాజీ, ఎన్‌ఎస్‌ఎస్ పీవో కె.తమ్మారావు, డి దుర్గాబాంధవి, జ్యోతి, త్రిమూర్తులు పాల్గొన్నారు.

సులభతరమైన బోధన అవసరం

▸ విద్యాశాఖ ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్



ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయ్ భాస్కర్

నక్కపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యా విధానంలో ఆధునికత సంతరించుకున్న తరుణంలో ఉపాధ్యాయులు సులభతరమైన బోధనను విద్యార్థులకు చేరువచేయాలని విద్యాశాఖ ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్ సూచించారు. మండలంలోని చినదొడ్డిగల్లు హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. టీచ్ టూల్ అనేది ఉపాధ్యాయులకు ఓ అభ్యాసన సాధనమని, బోధనలో ఉన్న లోపాలను ఉపాధ్యాయులు ఇటువంటి వర్క్‌షాప్‌ల ద్వారా సరిదిద్దుకోవాలని సూచించారు. బోధనా సహాయాలు, చిత్రాలు, డీవీడీ తదితర వస్తువులు, కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతీ ఉపాధ్యాయుడికి తెలిసి వుండాలన్నారు. ప్రపంచంతో పోటీపడే స్థాయికి విద్యార్థులను తీర్చిదిద్దడంపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కే నరేశ్, ఆర్.నాగన్నదొర, హెచ్‌ఎంలు బాలాజీ, వేమగిరి నూకరాజు, భవానీ తదితరులు పాల్గొన్నారు.

దాతల భాగస్వామ్యంతోనే ఆలయాల అభివృద్ధి



ఆలయ ఇన్‌స్పెక్టర్ నుంచి రశీదు పొందుతున్న దాత

నక్కపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆలయాలు అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు అభిప్రాయపడ్డారు. ఈ మండలంలోని పెదబోదిగల్లం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బొందలపు లక్ష్మణరావు శనివారం ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొండబాబు ద్వారా రూ. 50వేలు విరాళాన్ని అందజేశారు. వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు రశీదు అందజేశారు. అనంతరం కొండబాబు మాట్లాడుతూ ఉపమాక దేవస్థానం అభివృద్ధి వెనుక పూర్వం నుంచి ఎందరో దాతల సహకారం వుందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పొట్నూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



తిమ్మాపురం విశ్వబ్రాహ్మణుల కాలనీలో శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఎస్. రాయవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని విశ్వబ్రాహ్మణుల కాలనీలో రూ. 10 లక్షల ఎంపీపీ నిధులతో చేపడుతున్న నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు సంబంధిత ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు శ్రీకారం చుట్టారు. శనివారం ఎంపీపీ కె. వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి తదితరులు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో కొరుప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుర్రం రామకృష్ణ, టీడీపీ మం డల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి రాజు, పీఏసీఎస్ డైరక్టర్ కోన అప్పలరాజు, మాజీ సర్పంచ్ వి గోవింద్, జనసేన పార్టీ మండల నాయకుడు సేనాపతి బాబూరావు, ఎస్. రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి టీడీపీ నేతల సహాయం

నక్కపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట గ్రామంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి శనివారం ఆ గ్రామ టీడీపీ నాయకులు ఆర్థిక సాయమందించారు. గ్రామానికి చెందిన చోడిపల్లి రాజన్న గత కొన్న రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారిని టీడీపీ నాయకులు పరామర్శించారు. ఈ విషయాన్ని హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పిక్కి గంగరాజు, సొసైటీ అధ్యక్షుడు పిక్కి కోదండరావు, వాసుపల్లి శివాజీ, రాము,తాతయ్యలు, లోవరాజు, అప్పలరాజు, శ్రీను, కాశీ, కోదండ, తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

'రోలుగుంట సూరి' హిట్ అవుతుంది

▸ సినిమా పోస్టర్ ఆవిష్కరణలో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్



సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్, దర్శకుడు, హీరో హీరోయిన్

నక్కపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన నటులు, సాంకేతిక నిపుణుల నిర్మించిన రోలుగుంట సూరి సినిమా హిట్ అవుతుందని స్థానిక టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ అభిప్రాయపడ్డారు. శనివారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో ఈ సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ చిత్ర నిర్మాణం, ఇతర విషయాలను దర్శకుడు పల్లా అనిల్ కుమార్ వివరించారు. తపస్వీ ఆర్ట్ క్రియేషన్ బ్యానర్‌లో పల్లా నాగార్జున, ఆద్యారెడ్డి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారని తెలిపారు. అలాగే, పల్లా సౌమ్య చాందిని నిర్మాతగా వ్యవహరిస్తున్నట్టు వివరించారు. వెంకటేశ్ మాట్లాడుతూ, నక్కపల్లి మండలం ముకుందరాజుపేటకు చెందిన చొప్పా ముకుంద శ్రీనివాస్ విలన్‌గా అద్భుతంగా నటించారని, తప్పకుండా ఈ సినిమా విశేష ప్రేక్షకాదరణ పొందుతుందని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఈ చిత్రంలో నటించిన హీరోలు, ఇతర నటులంతా ఉన్నతస్థాయికి ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక నటులంతా సినిమాను నిర్మించి, నటించడం జిల్లా వాసులకు గర్వకారణమన్నారు. సినిమా టైటిల్ ఎంపికలోనే అద్భుతమైన ఆలోచన ఉందని, ప్రతీ ఒక్కరూ ఈ చిత్రాన్ని ఆదరించాలని వెంకటేశ్ కోరారు. ఈ కార్యమంలో దార్లకృష్ణ, సినిమా హీరో, హీరోయిన్లు, ఇతర నటులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు విద్యార్థినుల ఎంపిక



ట్రోఫీతో జయశ్రీ, తోనేశ్వరి

ఎస్. రాయవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు హాకీ క్రీడలో రాణిస్తున్నారు. శుక్రవారం నక్కపల్లి క్రీడా మైదానంలో జరిగిన హాకీ పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన బి. జయశ్రీ, కె. తోనేశ్వరి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం ప్రధానోపాధ్యాయిని ప్రశాంతి, పీ డీ శ్రీసత్య, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

కబడ్డీ, తైక్వాండోల్లో రాణింపు



షీల్డ్స్, పశంసాపత్రాలతో వైష్ణవి, ఆకాష్

ఎస్. రాయవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు కబడ్డీ, తైక్వాండో పోటీల్లో రాణిస్తున్నారు. 9వ తరగతి చదువుతున్న పి వైష్ణవి శుక్ర వారంగాజువాకలో జరిగిన అండర్-14 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు శనివారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కప్పల ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు అమ్మోరయ్య తెలిపారు. కృష్ణా జిల్లాలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని వైష్ణవి పాల్గొంటుందని చెప్పారు. పదో తరగతి విద్యార్థి ఆకాష్ పల్నాడు జిల్లాలో జరిగిన టైక్వాండో పోటీల్లో తృతీయ బహుమతి సాధించాడు. ఈ విద్యార్థులను ఉపాధ్యాయులు నానాజీ, అప్పలరాజు, రమేష్, విద్యా కమిటీ చైర్మన్ బత్తిన సత్యనారాయణ తదితరులు అభినందించారు.

ప్రభుత్వ స్థలాల వద్ద బోర్డులు ఏర్పాటు



తిమ్మాపురంలో ఏర్పాటుచేసిన బోర్డు వద్ద సర్పంచ్

ఎస్. రాయవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ పంచాయతీ తిమ్మాపురం పరిధిలో ఉన్న ప్రభుత్వ ఆస్తుల వద్ద వాటి వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేసినట్టు శనివారం సర్పంచ్ కర్రి సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, భవనాలు, స్కూల్స్ చెరువులు, శ్మశాన వాటికలు, పోరంబోకు స్థలాలు తదితర అన్నిటిని గుర్తించి వాటి రక్షణలో ఈ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన వివరించారు. ఈ మేరకు పంచాయతీ సభ్యుల ఆధ్వర్యంలో తీర్మానం చేసి స్పష్టంగా సర్వే నంబరు, వాటి విస్తీర్ణం తదితర వివరాలను సూచిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఈఎస్ఐసీ పథకాలపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఈఎస్ఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పరవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) అమలు చేస్తున్న వివిధ పథకాలపై శనివారం ఇక్కడి విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్‌లో గల కమర్షియల్ హబ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈఎస్ఐసీ విశాఖ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈఎస్ఐసీ నిర్వహిస్తున్న నూతన పథకాల గురించి వివరించారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు ఎంతగానో ఇవి ఉపయోగపడతాయన్నారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, అంగవైకల్యానికి సంబంధించిన పథకాలను వినియోగించుకోవచ్చునని వివరించారు. అనంతరం పలువురు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సదస్సులో ఈఎస్ఐసీ సూపరింటెండెంట్ శ్రీనివాస్, విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధరరావుభక్తి, వివిధ ఫార్మా పరి శ్రమల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ శేఖర్

పరవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జాయింట్ డైరెక్టర్ శేఖర్ సూచించారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో సీపీసీఈ లో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణలో తొలివిడత ముప్పై మందికి ఆరు నెలల పాటు శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉపకార వేతనంతో పాటు ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని చెప్పారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపెట్ సిబ్బంది పాల్గొన్నారు.

'కవి, తత్వవేత్త కనకదాస ఆలోచనలు స్ఫూర్తిదాయకం'



కనకదాస చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్వో సత్యనారాయణరావు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ భక్త కవి, తత్వవేత్త సెయింట్ కనకదాస జయంతిని శనివారం ఇక్కడి కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు హాజరై కనకదాస చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కనకదాస సమాజంలో సమానత్వం, సేవా భావం, భక్తి మార్గాన్ని ప్రజలకు చూపిన మహానుభావుడని తెలిపారు. కనకదాస గురించి నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన ఆలోచనలు ఈ తరానికి స్ఫూర్తిదాయకంగా పేర్కొన్నారు. ఆయన తన రచనల ద్వారా కుల వ్యవస్థ, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి, ప్రజలలో సమానత్వం కోసం కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారిణి శ్రీదేవి, బీసీ సంఘం నాయకులు, హాస్టల్ సంక్షేమాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాల అందజేత



క్యాంపు కార్యాలయంలో మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

సబ్బవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. అనారోగ్యంతో బాధ పడుతున్న అంతకాపల్లి శివారు ఒమ్మివాని పాలేనికి చెందిన నక్కెల్ల పైడికొండకు, పరవాడ మండలం లంకెలపాలేనికి చెందిన బం ధం శివలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను శనివారం పెందుర్తి లోని క్యాంపు కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. సంక్షేమ పథకాలను అర్హు లంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇం దలి వెంకటరమణ, మిడతాడ మహాలక్ష్మీ నాయుడు, కర్రి కనకరాజు, రొంగలి దేముడు బాబు, పల్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగలక్ష్మి తదితరులు

పరవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈనెల 14న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వృత్తి విద్య నైపుణ్య పోటీలకు పరవాడ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇటీవల సబ్బవరం మండలంలోని నిర్వహించిన జిల్లా స్థాయి వృత్తి విద్య నైపుణ్య పోటీల్లో బ్యూటీ అండ్ వెల్నెస్ విభాగంలో తమ పాఠశాలకు చెందిన దుర్గ, లాస్య, లీలా, దీక్షిత, అలేఖ్య, రుచితలు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు హెచ్‌ఎం గొల్ల రాజశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

'విద్యార్థులకు జీవ నైపుణ్యాలు ఎంతో అవసరం'



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం నాగేశ్వరరావు

కశింకోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెల 24 నుంచి జరుగుతున్న వ్యక్తిత్వ వికాస తరగతులు శనివారం ముగిశాయి. కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, నైతిక విలువలు ఎంతో అవసరమని తద్వారా క్రమశిక్షణతో మెలుగుతారని వివరించారు. అంతేకాకుండా సమాజంలో మంచి పౌరులుగా తయారవుతారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు బి.గురునాథ్, ఎం.నరేంద్రకుమార్, ఎస్.కామేశ్వరి, ఉపాధ్యాయులు బోయిన చిన్నారావు, చిన్ని శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.

దిబ్బపాలెంలో దారిద్ర్యం

- రోజుల తరబడి మురుగు తిష్ఠ
- వర్షాల నీరు, వాడుక నీరు కలవడంతో చెరువులా దర్శనం
- రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని పంచాయతీ



దిబ్బపాలెం రోడ్డులో చెరువులా దర్శనమిస్తున్న మురుగు



దిబ్బపాలెం మలుపు వద్ద నిలిచిపోయిన మురుగు

తుమ్మపాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ముగిసి దాదాపు పదిరోజులు కావస్తున్నా దిబ్బపాలెంలో మాత్రం ఆ జాడ ఇంకా సమసి పోలేదు. వరద నీటికి మురుగు తోడవ్వడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనకాపల్లి మండలం తుమ్మపాల నుంచి దిబ్బపాలేనికి వెళ్లే రహదారిలో ఎక్కడికక్కడ భారీగా మురుగు తిష్ఠ వేస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు చేరిన నీటితో పాటు స్థానికుల వాడకనీరు సైతం రోజుల తరబడి నిల్వ ఉండిపోయి అధ్వానంగా దర్శనమిస్తుంది. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా దిబ్బపాలెం మలుపు వద్ద మురుగునీరు చెరువును తలపిస్తుంది. దిబ్బపాలెం, ఊడేరు, బవులవాడ, తుమ్మపాల ప్రజలు నిత్యం ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటారు. పొలాలకు వెళ్లే రైతులు, పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగ, వ్యాపారాలకు వెళ్లి వచ్చే వారు ప్రతి రోజూ నరకం చూస్తున్నారు. నీరు నిల్వ ఉంటుండడం వల్ల దుర్వాసన వెదజల్లుతుండడంతో ముక్కు మూసుకొని మురుగునీటిలోంచే వెళ్లివస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం నీటిని తరలించే ప్రయత్నం కూడా పంచాయతీ అధికారులు చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగా ఇక చీకటిపడిందంటే చాలు దోమలు విజృంభించి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని పరిసరాల వారు వాపోతున్నారు. డెంగ్యూ, మలేరియా, చికన్‌గున్యా వంటి జ్వరాల బారిన ఎక్కడ పడాల్సి వస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఇక్కడి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిందిగా గ్రామస్థులంతా వేడుకుంటున్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు

- హెచ్‌ఎంలకు అసిస్టెంట్ కమిషనర్ శ్రీధర్‌రెడ్డి సూచన



రావలమ్మపాలెంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి

సబ్బవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను విధిగా కల్పించాలని పాఠశాల విద్యాశాఖ సహాయ కమిషనర్ ఎ.శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబుతో కలిసి మండలంలో ఏర్పాటు చేయనున్న పరీక్షా కేంద్రాలైన సబ్బవరం గురుకుల విద్యాలయం, ప్రతిభ విద్యాలయం, మదర్ పబ్లిక్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రావలమ్మపాలెం జడ్పీ హైస్కూల్, సన్‌రిడ్జ్ స్కూల్‌లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో డెస్కులు, విద్యుత్, తాగునీరు తదితర సదుపాయాలను కల్పించాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎటువంటి తప్పిదాలు జరగకుండా పక్కా ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

వరాహ లక్ష్మీనరసింహ ఆలయ కమిటీ ప్రమాణం



స్వామివారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేసిన శ్రీరామచంద్రమూర్తి

అనకాపల్లి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధిలో గల వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయ మొట్టమొదటి పాలక వర్గం శనివారం కొబ్బరితోటలో ప్రమాణ స్వీకారం చేసింది. సింహాచలం దేవస్థానం అర్చకులు ఎస్.నరసింహాచారి, బి.గోపాలాచార్యుల సమక్షంలో గౌరవాధ్యక్షుడిగా దొడ్డి వెంకట సత్యనారాయణ (బాబు), ఛైర్మన్‌గా ఆళ్ల శ్రీరామ చంద్రమూర్తి (రాంబాబు), కోశాధికారిగా కొణతాల త్రినాథరావు, అనువంశిక ధర్మకర్తలుగా మళ్ల కుమార్, దాడి భవాని, ధర్మకర్తలుగా సూరిశెట్టి జగన్నాథ రవి, బుద్ద చిన్నికుమార్, మళ్ల జగదీష్, బొడ్డేడ రాజేష్, మళ్ల ఉమా మహేష్, కొణతాల జగదీష్, కొణతాల సాయి, దొడ్డి వెంకటలక్ష్మి, పీలా వరహా సరోజినీదేవి, కొణతాల కుసుమ, కాండ్రేగుల లక్ష్మి, భీమరశెట్టి రేవతిలు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ కౌన్సిలర్ పి.వి.జగన్మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జోగినాయుడు, కొణతాల వాసు, దాడి భాస్కరరావు, కాండ్రేగుల అప్పారావు, మద్దాల కృష్ణారావు, యల్లపు గోవింద, రాపేటి శ్రీను, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు భువనేశ్వరీ దేవి ఆదివాస మహోత్సవం

సబ్బవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరిపాక పంచాయతీ పెదయాతపాలెం సమీపం మణిపురంలో కొలువుదీరిన భువనేశ్వరీదేవి ఆదివాస మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. 42 రోజులకు ఒకసారి జరిగే ఈ వేడుకను ఈ వారం జిల్లేడు పత్రితో చేపడుతుండడం ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి విజయవంతం చేయాల్సిందిగా వారు కోరారు.

15న షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సబ్బవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆరిపాక శివారు టెక్కలిపాలెం సమీపం చెరకు కాటా వద్ద గల షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఈనెల 15న జరగనుంది. ఇందుకు సంబంధించి విస్తృతంగా ఏర్పాట్లు చేపడుతున్నట్టు ఆలయ నిర్మాణకర్త, మాజీ ఎంపీటీసీ మల్ల కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ వేడుకల్లో భాగంగా విశేష పూజలతో పాటు మహిళలకు కోలాటం పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం



గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న మళ్ల సురేంద్ర

కొత్తూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం పిసినికాడ పంచాయతీ రామభద్రపురం కాలనీలో గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆది దంపతులకు విశేష పూజలు నిర్వహించారు. గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ళ సురేంద్ర ఉత్సవమూర్తులను దర్శించుకొని అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బొడ్డేడ శ్రీను, యల్లపు వెంకట్రావు, వేగి కృష్ణ, సత్యనారాయణ, భానుచందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లా రెడ్‌క్రాస్ కమిటీ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో సత్యనారాయణరావు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లా రెడ్‌క్రాస్ శాఖ ఛైర్మన్ సి.బాల సతీష్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లాకు సంబంధించి కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు సమక్షంలో నిర్వహించారు. అనకాపల్లి రెడ్‌క్రాస్ ఛైర్మన్‌గా డాక్టర్ గ్రంధి శేషుకుమార్, వైస్ ఛైర్మన్‌గా పి.సురేశ్వరరావు, ట్రెజరర్‌గా పి.కృష్ణంరాజు ఎన్నికయ్యారు. గత సంవత్సరంలో చేపట్టిన రక్తదాన శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు, విపత్తు సహాయక చర్యలు, యువ రెడ్‌క్రాస్ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. రాబోయే సంవత్సరానికి ప్రణాళికలు, సేవా కార్యక్రమాల విస్తరణపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు, వైద్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అయ్యప్పస్వామి పూజ



అయ్యప్పను దర్శించుకుంటున్న చొక్కాకుల వెంకటరావు

సబ్బవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంతకాపల్లిలో అయ్యప్పస్వామి పూజను శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో స్వామి మాల ధరించిన భక్తులు విచ్చేసి చక్కని గీతాలను ఆలపించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను బీజేపీ నాయకుడు చొక్కాకుల వెంకటరావు, సర్పంచ్ ఎస్.నారాయణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు చొక్కాకుల గోవింద ప్రారంభించారు. అంతకు ముందు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎస్.ముత్యాలనాయుడు, టీడీపీ నాయకులు ఎం.మహలక్ష్మీనాయుడు, గొర్లె అప్పారావు, ఎస్.దేవుడుబాబు, ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

'జగన్‌రెడ్డి చౌకబారు రాజకీయాలు మానుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద

తుమ్మపాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జగన్‌రెడ్డి చౌకబారు రాజకీయాలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు సూచించారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 14, 15 తేదీల్లో జరగనున్న సమ్మిట్‌లో రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టేందుకు పలు దేశాల నుంచి పెట్టుబడుదారులు వస్తున్న సమయంలో ఈ నెల 12వ తేదీన వైసీపీ విద్యార్థి విభాగం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆందోళన కార్యక్రమానికి పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము మూడువేల కోట్ల రూపాయలు బకాయిపడ్డారని గుర్తు చేశారు. బి.టెక్, ఎం.టెక్ చదువుకున్న విద్యార్థులు చదవలేని పరిస్థితి కల్పించారన్నారు. తక్షణమే జగన్‌రెడ్డి ఆలోచన తీరును మార్చుకోవాలని, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే విధంగా సూచనలు చేయాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, సాలాపు నాయుడు, పిళ్లా తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భోగలింగేశ్వరస్వామికి పూజలు

అనకాపల్లి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా శనివారం గవరపాలెం కోట మీద గల భోగలింగేశ్వరస్వామికి మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను ఆలయ మాజీ ఛైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లా నాయుడు, డీవీడీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన సదస్సు



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న టీచర్ అరుణ

పరవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ సెక్టార్ పరిధిలో గల హైస్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా బాల్య వివాహాలు, వ్యక్తిగత పరిశుభ్రత, బ్యాడ్ టచ్, గుడ్ టచ్ తదితర అంశాలపై వివరించారు. అలాగే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భయపెడుతున్న సామాజిక భవనం

తొలగించాలని పెదముషిడివాడ ఎస్సీ కాలనీ వాసుల వినతి



శిథిలావస్థలో ఉన్న సామాజిక భవనం

లంకెలపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెదముషిడివాడ ఎస్సీ వీధిలో ఉన్న సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకొంది. సామాజిక అవసరాల నిమిత్తం సుమారు మూడు దశబ్దాల క్రితం ఇక్కడ ఈ భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం పూర్తిగా శిథిలమైంది. గోడలు పెచ్చులూడి పడుతున్నాయి. పెద్ద రంధ్రాలు పడ్డాయి. కిటికీలు, తలుపులకు చెదలు పట్టి ఊడిపోయాయి. పైకప్పు రేకులు పగిలి పోయాయి. ఏక్షణంలో కూలిపోతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. నివాసాల మధ్య ఈభవనం ఉండడంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని శిథిలమైన భవనాన్ని తొలగించాలని నివాసితులు కోరుతున్నారు.

వాట్సాప్ ద్వారా కనకమహాలక్ష్మి అమ్మవారి సేవల బుకింగ్

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహించే మార్గశిర మాసోత్సవాలలో సేవలను ఆన్‌లైన్ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా బుక్ చేసుకోవచ్చునని అధికారులు ప్రకటించారు. ఈ నెల 21 నుంచి డిసెంబరు 19 వరకు నిర్వహించనున్న మార్గశిర మాసోత్సవాల సందర్భంగా గురువారం పంచామృతాభిషేకానికి రూ.10 వేలు, మిగిలిన రోజుల్లో రూ.3 వేలుగా నిర్ణయించారు. విశిష్ట దర్శనం టికెట్టు రూ.500 ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 నెంబరు ద్వారా బుక్ చేసుకోవచ్చునని సూచించారు.

ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు షరీఫ్‌ను కలిసిన బాబర్

కశింకోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు, శాసన మండలి మాజీ ఛైర్మన్ ఎంఏషరీఫ్‌ను అనకాపల్లి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.రెహమాన్ (బాబర్) శనివారం కలిశారు. బుచ్చెయ్యపేట మండలం రాజాంలో మసీదు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయనను కలిసిశాలువాతో సత్కరించారు

బండి కాదు మొండి ఇదీ..సాయం పట్టండి

- జోలాపుట్టు నైట్‌హాల్ట్ బస్సు తరచూ మొరాయింపు
- ఘాట్ రోడ్డులో నిలిచిపోతున్న వైనం
- ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

ముంచంగిపుట్టు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని మధురవాడ ఆర్టీసీ డిపోకు చెందిన జోలాపుట్టు నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు తరచూ మొరాయిస్తోంది. ఈ బస్సు ఎక్కితే గమ్యస్థానానికి చేరుతామో, లేదో తెలియని పరిస్థితి. శుక్రవారం ఉదయం జోలాపుట్టు నుంచి విశాఖ మీదుగా మధురవాడ బయలుదేరిన ఆ బస్సు పాడేరు ఘాట్ మార్గంలో 12 మైలు వద్ద మొండికేసింది. రేడియేటర్‌లో సాంకేతికలోపం తలెత్తడంతో సుమారు గంటపాటు నిలిపేశారు. దీంతో ఇందులోని సుమారు 50 మందికి పైగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సుమారు గంట తరువాత ఆ బస్సు ముందుకు కదిలింది. జోలాపుట్టునుంచి ముంచంగిపుట్టు మీదుగా విశాఖ వెళ్లేందుకు ఉన్న ఒక్క బస్సు సర్వీసు (ఏపీ 30 జెడ్ 0142) తరచూ మొండికేస్తోంది. సంబంధిత ఆర్టీసీ అధికారులు దీని బాగోగులపై కనీస దృష్టిసారించక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది ఇదే బస్సు సర్వీసు గత మూడు నెలల వ్యవధిలో సుమారు ఐదుసార్లు మార్గం మధ్యలో ఆగిపోయింది. ఇటీవల మధురవాడ నుంచి బయలుదేరి విశాఖ ద్వారకానగర్ బస్టాప్ వద్ద సాయంత్రం 3 గంటల సమయంలో నిలిచిపోయింది. దీంతో ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు మరో బస్సును ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఆ బస్సు చోడవరం సమీపానికి వచ్చేసరికి తిరిగి హెడ్‌లైట్లు పోయాయి. వాటిని అనకాపల్లి ఆర్టీసీ డిపో నుంచి మెకానిక్‌లు వచ్చి మరమ్మతు చేశారు. దీంతో ముంచంగిపుట్టు రాత్రి తొమ్మిది గంటలకు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారు మూడు గంటలకు చేరుకుంది. దీంతో ప్రయాణికులు తిండీ తిప్పలు లేకుండా ఇబ్బంది పడ్డారు. అలాగే, గత సెప్టెంబరు 21న పాడేరు నుంచి వెళ్తూ మాడుగుల ఘాట్‌రోడ్డు జంక్షన్ వద్ద నిలిచిపోయింది. శ్రీకాకుళం రూటులోనూ ఓసారి ఆగిపోయింది. ఇలా ఈ బస్సు తర చూ మార్గం మధ్యలో మొరాయించడం పరిపాటుగా మారింది.


పాడేరు ఘాట్ మార్గం మధ్యలో గల 12మైలు సమీపంలో శుక్రవారం ఆర్టీసీ బస్సు ఆగిపోయిన దృశ్యం

డొక్కు బస్సుతో భయం... భయం

మధురవాడ ఆర్టీసీ డిపోకు చెందిన ఈ జోలాపుట్టు నైట్‌హాల్ట్ సర్వీసు బస్సు ఎక్కాలంటేనే ప్రయాణికులు భయపడిపోతున్నారు. ఈ రూట్‌లో తిరిగే ఈ ఒకే బస్సును తప్పనిస్థితిలో ఆశ్రయించాల్సి వస్తోందని ఈ ప్రాంతీయులు వాపోతున్నారు. అసలే ఘాట్ మార్గం కావడం, ఆ బస్సు కనీసం కండీషన్‌లో లేకపోవడంతో భయాందోళన మధ్య రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. మొరాయిస్తున్న ప్రతిసారీ ఆర్టీసీ అధికారులు ఆ బస్సు స్థానంలో మరొకటి పంపుతామని ప్రకటనలు చేయడం... తర్వాత మరిచిపోవడం జరుగుతోంది. ఘాట్ రోడ్డులో పెను ప్రమాదాలు జరగక ముందే ఆర్టీసీ అధికారులు స్పందించి కండిషన్‌లో ఉన్న బస్సు సర్వీసును ఇటుగా నడపాలని ఈ ప్రాంతీయలు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ: ఏటీడబ్ల్యూవో


హెచ్‌డబ్ల్యూవో, డిప్యూటీ వార్డెన్లతో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి

చింతపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలో చింతపల్లి, జీకేవీధి మండలాల హెచ్‌డబ్ల్యూవో, డిప్యూటీ వార్డెన్లతో ఆమె సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఏటీడబ్ల్యూవో మాట్లాడుతూ పాఠశాలలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, పారామెడికల్ ఉద్యోగులు క్రమంగా సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల్లో అనారోగ్య సమస్య కనిపించిన వెంటనే హెచ్‌డబ్ల్యూవో, డిప్యూటీ వార్డెన్లు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వెళ్లి చికిత్స అందించాలన్నారు. అవసరమైతే మైదాన ప్రాంతాలకు తీసుకు వెళ్లి మెరుగైన చికిత్సనందించానని కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థిలను ఎట్టి పరిస్థితుల్లోనూ గృహాలకు పంపించరాదన్నారు. పాఠశాలల్లో మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. మెనూ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాలు పెట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన కాస్మొటిక్స్ విద్యార్థులకు పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాల పదోతరగతి విద్యార్థులు శతశాత ఉత్తీర్ణత సాధించాలన్నారు.

ఒకేషనల్ కోర్సులో ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



జేసీ నుంచి ప్రశంసా పత్రం, షీల్డ్ అందుకుంటున్న కొయ్యూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

కొయ్యూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ కోర్సులో జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచి ప్రథమ, ద్వితీయ స్థాయి బహుమతులను స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల-1 విద్యార్థులు సొంతం చేసుకున్నారు. శుక్రవారం పాడేరులో జిల్లా స్థాయి స్కిల్ కాంపిటేషన్ నిర్వహించారు. ఇందులో పది ట్రేడ్‌లకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా గల అన్ని పాఠశాలల నుంచి 142 బృందాలకు గా నూ 300 విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో కొయ్యూరు పాఠశాల విద్యార్థులు బృందం బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీస్ అండ్ ఇన్సూరెన్సు కోర్సుకు సంబంధించిన ప్రాజెక్టులో ప్రథమ బహుమతి, ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ ప్రాజెక్టులో ద్వితీయ బహుమతి సాధించారు. బిఎఫ్ఎస్ఐ ట్రేడ్ ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయి స్కిల్ కాంపిటేషన్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు అసిస్టెంట్ కలెక్టరు సాహితి, జీసీడీవో కవితలనుంచి షీల్డ్‌తో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈవిద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు బొడ్డు సిసింద్రీ నాయుడు, విద్యార్థులను ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, హెచ్ఎంశ్రీనివాసరావు అభినందించారు.

పవన్ కల్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం

- గూడెంలో విద్యుత్ సౌకర్యంపై గిరిజనుల హర్షం


ఉపముఖ్యమంత్రి ఫొటొకు క్షీరాభిషేకం చేస్తున్న గూడెం గ్రామస్థులు

అనంతగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల రొంపల్లి పంచాయతీ గూడెం గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించడంపై శనివారం జనసేన సేవాదళ్ ఇన్‌చార్జి వన్నెంరెడ్డి సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలోని గిరిజనులు ఉప ముఖ్యమంత్రి ఫొటోకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సతీశ్‌కుమార్ మాట్లాడుతూ. గత జూలైలో గూడెం గ్రామానికి వెళ్లి, గిరిజనులు పరిస్థితిని స్వయంగా చూసి, అనంతరం సోషియో ఎకనామిక్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ దీపాలను అందించామని చెప్పారు. తర్వాత గూడెంలో సమస్యలపై ఉపముఖ్యమంత్రికి పవన్‌కల్యాణ్‌కు వివరించినట్టు పేర్కొన్నారు. దీంతో రూ.80 లక్షల వ్యయంతో గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించారని, అలాగే జలజీవన్ మిషన్‌లోని తాగునీరు, పాఠశాల, అంగన్‌వాడీ భవనం తదితర సమస్యలను పవన్‌కల్యాణ్‌కు దృష్టికి వివరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి రమేశ్, జనసైన నాయకుడు కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనేతరుల ఆక్రమణలు'


మాట్లాడుతున్న గిరిజన సంఘ నేతలు

హుకుంపేట నవంబర్ 8 ఆంధ్రజ్యోతి ; గిరిజనేతరుల నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు టి. కృష్ణారావు ఎస్,హైమావతి డిమాండ్ చేశారు , శనివారం గిరిజన భవనంలో వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హుకుంపేటలో గిరిజన నేతరులు ఖాళీ స్థలం కనిపిస్తే ఆక్రమిస్తున్నారన్నారు. ముందు పాకలు వేసి, తర్వాత షెడ్లు నిర్మిస్తున్నారన్నారు. విచ్చలవిడిగా దుకాణాలు, ఇతర భవనాలు నిర్మిస్తున్నారన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం స్పందించంలేదన్నారు. గిరిజనులు జీవనోపాధికి దుఖణాలు ఏర్పాటు చేస్తే రెవెన్యూ సిబ్బంది వారిని బలవంతంగా తొలగిస్తున్నారన్నారు. 1/70 చట్టం లేద భూబదలాయింపు చట్టాలను ఉల్లంఘనలు యథేచ్ఛగా సాగుతున్నాయన్నారు. ఇకనైనా అక్రమనిర్మాణాలు నిలుపుచేయకుంటే అందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు కృష్ణారావు, లక్ష్మణరావు, కృష్ణమూర్తి, లింగమూర్తి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కళా ఉత్సవంలో విద్యార్థుల సత్తా


వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు

చింతపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కళా ఉత్సవంలో స్థానిక ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాల(ఈఎంఆర్ఎస్) విద్యార్థులు సత్తాచాటారు. మారేడుమిల్లిలో ఇటీవల కళాప్రదర్శన పోటీలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగానున్న 28 ఈఎంఆర్ఎస్ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. స్థానిక పాఠశాల నుంచి హాజరైన విద్యార్థుల్లో క్లాసిక్ మ్యూజిక్ సీనియర్ విభాగంలో ఎం. రేణుక, గిరిజన పెయింటింగ్‌లో కె. విజయ్ కుమార్ ప్రథమ స్థానాలు, గిరిజన గ్రూప్ డ్యాన్స్‌లో స్వప్న, స్మైలీ, చందన, జాహ్నవిలు ద్వితీయ స్థానం, ట్రైబల్ స్టోరీ టెల్లింగ్‌లో ఎం.హారిక, వి. ఆనంద్, ఇంగ్లీష్ స్టోరీ స్పెల్లింగ్‌లో వర్షిత ద్వితీయ స్థానాలు, ఇంగ్లీష్ వక్తృత్వంలో కె.దీనకుమారి తృతీయ స్థానం సాధించారు.విజేతలుగా నిలిచిన విద్యార్థులు, సాంస్కృతిక విభాగ అధిపతి రాహుల్ సింగ్‌ని ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులులోవరాజు, బద్రి ప్రసాద్, లావణ్య, సర్వసతి, రుచి అగర్వాల్‌పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది: ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరురూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లో రక్తదానం గొప్పదని స్థానిక ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు అన్నారు. ఆదివాసీ విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.మహేశ్, కె.కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ విలేకరులు ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతో మంది ప్రాణాలను కాపాడిన వారవుతారన్నారు. జిల్లా ఆస్పత్రిలో రక్తనిల్వలు పూర్తి స్థాయిలో లేని సమయంలో ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 20 మంది యువకులు 20 యూనిట్‌ల రక్తదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి విలేకరుల సంక్షేమ సంఘం, జైభీమ్ నాయకులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు


ప్రత్యేక పూజల్లో భక్తులు

సీలేరు, నవంబరు 8 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు శివాలయంలో కార్తీకమాసం సందర్భంగా శనివారం రాత్రి సంకట హర చతుర్థిని నిర్వహించారు. ముందుగా సా యంత్రం ఆరు గంటలకు ఆలయంలో ఆకాశదీపం కార్యక్రమాన్ని ఏపీ జెన్‌కో ఏడీఈ శ్రీధర్‌కుమార్ దంపతులు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు రామశర్మ ఆధ్వర్యంలో గణపతి, సామూహిక కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

జీకే వీధి సర్పంచ్ తీరుకు వ్యతిరేకంగా వార్డు మెంబర్ రాజీనామా


ఎంపీడీవోకి రాజీనామా పత్రం అందజేస్తున్న వార్డు సభ్యురాలు జర్తా రాజేశ్వరి

గూడెంకొత్తవీధి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాలు, వివక్షతకు నిరసనగా టీడీపీ మద్దతుదారు, రెండోవ వార్డు సభ్యురాలు జర్తా రాజేశ్వరి పదవికి రాజీనామా చేశారు. శనివారం రాజీనామా పత్రాన్ని ఎంపీడీవోకు అంద జేశారు. ఈసందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ నిధులు ఖర్చు, ఆదాయం వివరాలను సర్పంచ్ వార్డు సభ్యులకు వివరించడంలేదన్నారు. పంచాయతీ పాలకవర్గం సమావేశాలు నిర్వహించలేదన్నారు. పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు సభ్యుల తీర్మానం లేకుండా చేపడుతున్నారని ఆరోపించారు. సర్పంచ్ పంచాయతీరాజ్ అధికారులు వార్డు సభ్యులకు కనీస ప్రాధాన్యం ఇవ్వడంలేదన్నారు. టీడీపీ మద్దతు వార్డు సభ్యురాలిని కావడంతో అభివృద్ధి కార్యక్రమాలపై తనకు సమాచారం ఇవ్వడంలేదని ఆరోపించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సైతం ఆహ్వానించడంలేదన్నారు. తాజాగా మండ పరిషత్ నిధులతో రెండో వార్డు పరిధిలో 20 గృహాలు ఉన్న ప్రాంతంలో కాకుండా. కేవలం వైసీపీ మద్దతుదారుల గల రెండిళ్లున్నచోట సీసీ రోడ్డు నిర్మిస్తున్నారన్నారు. దీనిపై కలెక్టర్, పాడేరు టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరికి ఫిర్యాదు చేశామన్నారు.

'పాడేరులో రోడ్డును 80 అడుగుల మేర విస్తరించాలి'


జేసీ నుంచి ప్రశంసా పత్రం, షీల్డ్ అందుకుంటున్న కొయ్యూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

పాడేరురూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాడేరు మెయిన్ రోడ్డులో 80 అడుగుల మేర విస్తరణ పనులను చేపట్టాలని ఏజెన్సీ ప్రాంత రోడ్డు అభివృద్ధి వేదిక, పెసా కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సుండ్రుపుట్టు సాయిబాబా ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా మారిన తరువాత పాడేరులో ట్రాఫిక్ రోజు రోజుకు పెరిగి పట్టణంలో అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆఫీసులకు వెళ్లే అధికారులు, ఇతర ఉద్యోగులు, అత్య అవసర రోగులను ఆస్పత్రులకు తరలించే అంబులెన్స్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ స్థితిలో ప్రస్తుతం ఉన్న రోడుకు ఇరువైపులా 40 అడుగుల అడుగులు వెడల్పు చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు పాల్పడిన వ్యాపారులే స్వచ్ఛందంగా తొలగించాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ లేని పాడేరును తీర్చి దిద్దేందుకు వ్యాపారులు సహకరించాలని కోరారు.

మూడో రోజుకు చేరిన కాఫీ కార్మికుల సమ్మె

పాడేరురూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఎఫ్‌డీసీలోని తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాఫీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారానికి 3వ రోజుకు చేరుకుంది. కాఫీ తోటల పనులకు దూరంగా ఉంటున్న వారు ఏపీఎఫ్‌డీసీ మినుములూరు కాఫీ ఎస్టేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఎల్.సుందరరావు మా ట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కాఫీ బోర్డు అధికారులు స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కాఫీ బోర్డులో ఖాళీగా ఉన్న వివిధ కేడర్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, కార్మికులకు రోజువారి కూలీ రేట్లు, కాఫీ పండ్ల సేకరణకు ధర పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కాం తమ్మ, దేవి, వరలక్ష్మి, మంగమ్మ, లక్ష్మి, సత్యానారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

పెదబయలు: కాఫీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కాఫీ కార్మికుల సంఘం అల్లూరి జిల్లా గౌరవ అధ్యక్షుడు లింగేరి సుందరరావు డిమాండ్ చేశారు. మండలంలోని చుట్టుమెట్ట కాఫీ ఎస్టేట్ ఎదుట జరుగుతున్న కార్మికుల సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గత ఒప్పందం మేరకు రోజువారి కూలీ రేట్లు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుందర్‌కుమార్, రామారావు, సిద్ధేశ్వరరావు, నాగరాజు, బల్లెట్, మాధవరావు, సోనియా, రాధమ్మ, సుందరి, నిర్మల, కుమారి తదితరులు పాల్గొన్నారు.


ఏపీఎఫ్‌డీసీ మినుములూరు ఎస్టేట్ వద్ద ఆందోళనలో కాఫీ కార్మికులు

10న ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యంతో చర్చలు

చింతపల్లి:స్థానిక డివిజన్ కార్యాలయంలో ఈనెల 10తేదీన ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యం, కాఫీ కార్మికుల మధ్య చర్చలు జరుగుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. శనివారం కాఫీ కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాఫీ కార్మికులు సమస్యలపై సమ్మె చేపడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఏపీఎఫ్‌డీసీ అధికారులు నోటీసు ఇచ్చారన్నారు. ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యంతో జరిగే చర్చలు సఫలం కావాలని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి , సీఐటీయూ నేత మోరి వెంకటగిరి, కాఫీ కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు


సారెతో వెళ్తున్న మహిళలు

పాడేరురూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గౌరీ సేవా సంఘం పాడేరు కమి టీ ఆధ్వర్యంలో జరుగుతున్న గౌరీపరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా శనివారం సారెను పట్టణ పురవీధుల్లో భారీ ఊరేగించారు. ఈ సందర్భంగా సేవా సంఘం మహిళలు వివిధ రకాల పిండి వంటలు, పండ్లతో గౌరీ పరమేశ్వరులకు సారె ను సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఏటా కార్తిక మాసంలో చేపట్టే గౌరీపరమేశ్వరుల నెల రోజుల ఉత్సవంలో భాగంగా ఈ నెల 12వ తేదీన ఆలయం వద్ద భారీ ఎత్తున అన్న సమారాధన, 15న మహిళలకు పసుపు కుంకుమలను ప్రసాదంగా పంపిణీ చేస్తామని ఆలయ కమిటీ ప్రతినిధి కొణతాల సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యర్రవరం జలపాతానికి గంగా హారతి


హారతిలో మహిళా భక్తులు, గిరిజన అర్చకులు

చింతపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రవరం జలపాతంలో భక్తులు, గిరిజన అర్చకులు గంగ హారతి నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని శనివారం అర్చకులు జలపాతం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. విశ్వశాంతి, హిందూ ధర్మ పరిరక్షణకుగంగాహారతి నిర్వహించినట్టు మండ ధర్మ ప్రచారక్ జిల్లా కమిటీ సభ్యులు వెంకట గిరి, మండల కన్వీనర్ కోటేశ్వరారవు, సహాయక కన్వీనర్ వెంకటరమణ తెలిపారు.

ఉచ్చులో పడి దుక్కిటెద్దు మృతి


వేటగాడి అమర్చిన ఉచ్చులో పడి మృతి చెందిన ఎద్దు

జి.మాడుగుల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నుర్మతి పంచాయతీ మద్దివీధి లో శుక్రవారం రాత్రి వేటగాళ్ల వన్యప్రాణుల కోసం అమర్చిన ఉచ్చులో పడి గ్రామానికి చెందిన గొల్లోరి ప్రసాద్‌కు చెందిన దుక్కిటెద్దు మృత్యువాత చెందింది. దీంతో ఆర్థికంగా నష్టపోయనట్టు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత అధికారులు వేటగాళ్లపై చర్యలు చేపట్టాలని కోరారు.

పక్కా గృహాలకు పెంచిన నగదు మంజూరు చేయాలి

- గిరిజన సంఘం నేత బాలదేవ్


హారతిలో మహిళా భక్తులు, గిరిజన అర్చకులు

చింతపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ పక్కా గృహాల లబ్ధిదారులకు ప్రభుత్వం పెంచిన అదనపు నిధులు రూ.లక్ష వెంటనే మజూరు చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అన్నారు. శనివారం గిరిజన భవన్‌లో ఆదివాసీలతో సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీటీజీలకు మంజూరు చేసిన పక్కా గృహాలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. గ్రామాల్లో ఆదికర్మయోగా పథకంలో భాగంగా 12 రకాల అభివృద్ధి కార్యక్రమాలు వెంటనే ప్రారంభించాలన్నారు. పీవీటీజీల హక్కుల సాధన కోసం సోమవారం నిర్వహించే ధర్నాను ఆదివాసీలు విజయవంతం చేయాలన్నారు. గిరిజన సంఘం నాయకులు ధర్మన్నపడాల్, సాగిన చిరంజీవి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి షాట్‌పుట్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వైష్ణవి

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 8, (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-2లో 9వ తరగతి చదువుతున్న వంతాల వైష్ణవి జాతీయ స్థాయి షాట్‌పుట్ పోటీలకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో ఆమెను ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. విశాఖలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి షాట్‌పుట్ పోటీలో ప్రథమ బహుమతి, శ్రీకాకుళం జిల్లా గోవిందపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచి, వైష్ణవి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయుడు, పీడీ జె.మన్మధరావు, పీఈటీ పి.నీలకంఠం, ఇతర ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

18న గిరిజన సమాఖ్య మహాసభ

కొయ్యూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మరేడుమిల్లిలో ఈ నెల 18న గిరిజన సమాఖ్య జిల్లా మహాసభ నిర్వహించనున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం కొయ్యూరులో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దేముడు, రాజులతో కలసి విలేకరులతో కలిసి మాట్లాడారు. ఈ నెల 18న మారేడుమిల్లి వర్తక సంఘ భవనంలో ఈ మహాసభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మహాసభకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు జీవీ సత్యనారాయణ మూర్తి, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కారందొరయ్య, వైఎల్ రామాంజనేయులు పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని సత్యనారాయణ కోరారు.

హుకుంపేట మండల సమావేశం రేపు

హుకుంపేట నవంబర్ 8 ఆంధ్రజ్యోతి ; మండల సర్వసభ సమావేశం ఈ నెల 10 సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు స్థానిక ఎంపీడీవో రమాదేవి తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని కోరారు.

ఆశ్రమ పాఠశాల ఆవరణలో చెత్త తొలగింపు


కొక్కిరాపల్లి పాఠశాలలో చెత్తను తొలగింపు పనుల్లో హెచ్ఎం

జి.మాడుగుల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాలపై కొక్కిరాపల్లి ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తను తొలగించినట్లు హెచ్ఎం డి. రాంబాబు తెలిపారు. స్థానికులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కలె క్టర్ ఆదేశాలతో చెత్తను తొలగించినట్టు హెచ్ఎం తెలిపారు.

గంజాయితో అనర్థాలపై అవగాహన


ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఈగల్ బృందం

డుంబ్రిగుడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో విద్యార్థులంతా మంచి పౌరులుగా ఎద గాలని ఈగల్ టీం పోలీసులు సూచించారు. మండలంలో శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలగంజాయిపై పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి సేవించడం, రవాణా, విక్రయాలు చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి వ్యసనానికి బానిసలై యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. స్థానిక పోలీసు సిబ్బంది, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను సత్కరిస్తున్న నాయకులు

కూటమి నాయకులతో కలిసి పనిచేయండి

▸▸ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

నాతవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీజేపీ శ్రేణులు కూటమి నాయకులతో కలసి పని చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్ సూచించారు. విజయవాడ నుంచి పాడేరు వెళ్తూ డి.యర్ర వరం గ్రామంలో శనివారం పార్టీ నేతలతో ఆయన సమావేశమయ్యారు. గడప గడపనకు వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అలాగే వచ్చే స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు. అంతకు ముందు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ మండల మాజీ అధ్యక్షుడు లాలం వెంకటరమణను మాధవ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు సబ్బి కుమార్ స్వామి ఆధ్వర్యంలో నాయకులు మాధవ్‌కు సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాదె శ్రీనివాసు, శ్రీరంరెడ్డి సూర్యనారాయణ, సత్యనారాయణ, బోళెం శివ, గవిరెడ్డి త్రినాథ్, పి.బుల్లిదొర, శివాజీ, ఎల్.విక్రమ్ పాల్గొన్నారు.

ఆర్‌ఈసీ రోడ్డు గుంతల పూడ్చివేత

▸▸ 'ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్'



దాసరయ్యపాలెం వద్ద ఎక్స్‌కవేటర్‌తో గోతులను పూడ్పిస్తున్న పోలీసులు

రావికమతం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రావికమతం-తోటకూరపాలెం ఆర్‌ఈసీ రోడ్డు గుంతల పూడ్చి వేతకు పోలీసులు శ్రీకారం చుట్టారు. 'అడుగుకో గొయ్యి.. గజానికో గుంత' అనే శీర్షికతో ఆర్‌ఈసీ రోడ్డు దుస్థితిపై ఈ నెల 3న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఆర్‌అండ్‌బీ శాఖ కనీసం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవరిస్తున్నది. అయినప్పటికీ గుడిప పంచాయతీ పాలకవర్గం, గ్రామస్థులు స్పందించి గొంప జంక్షన్ నుంచి తట్టబంద ఆదర్శ ప్రైవేటు పాఠశాల వరకూ మూడు కిలోమీటర్ల మేర భారీ గుంతలను గ్రావెల్‌తో పూడ్చారు. అయితే గొంపమెట్ట నుంచి దాసరయ్యపాలెం వరకు మిగిలి ఉన్న భారీ గోతుల్లో రోజు ఏదోక వాహనం కూరుకుపోయి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు స్పందించారు. శనివారం లారీలతో గ్రావెల్ తెప్పించి ఎక్స్‌కవేటర్‌తో భారీ గుంతలను పూడ్పించారు. ఎస్‌ఐ ఎం.రఘువర్మ, పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమం చేపట్టారు. కాగా, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారుల తీరుపై మాత్రం ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు పది మంది విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాకవరపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఆర్.రషిత, కె.ఇందు, ఎస్.షాన్‌ముఖప్రియ, వి.పూజిత, ఎమ్.భువనశ్వరి, వి.గణేశ్, సందీప్, పి.భవానీ, కె.వైష్ణవి, వి.బాబీ సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు హెచ్‌ఎం డి.నారాయణరావు తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు వ్యాయమ ఉపాధ్యాయుడు రవి అభినందించారు.

కూటమి పాలనలోనే చౌడువాడ అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఎరుకునాయుడు, నాయకులు

కె.కోటపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చౌడువాడ మేజర్ పంచాయతీ కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి చెందిందని సర్పంచ్ దాడి ఎరుకునాయుడు పేర్కొన్నారు. తన స్వగృహంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తమ హయాంలోనే సబ్ స్టేషన్ అనుమతులు వచ్చాయని వైసీపీ నేతలు అనడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ పాలనలో తాను సర్పంచ్‌గా తీర్మానం చేసి డిప్యూటీ సీఎంగా ఉన్న బూడి ముత్యాలనాయుడుకు నివేదించినా, ఆయన సబ్ స్టేషన్ తేలేదని గుర్తు చేశారు. ఎన్నికల ముందు చౌడువాడ గ్రామానికి వచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి లోవోల్టేజి, విద్యుత్, వ్యవసాయ కనెక్షన్ల సమస్యలను తెలిపి సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని కోరామని, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఐదు నెలల్లోనే ఎమ్మెల్యేగా ఆయన విద్యుత్ శాఖ మంత్రితో మాట్లాడి మంజూరు చేయించారని సర్పంచ్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే చౌడువాడ గ్రామం రాష్ట్ర స్థాయిలో రెండు అవార్డులు అందుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆయన వెంట పీఏసీఎస్ ఛైర్మన్ రాజీ నారాయణమూర్తి, జనసేన కార్యదర్శి కుంచా అంజిబాబు, నాయకులు శ్రీను, రాజు, వార్డు సభ్యులు ఉన్నారు.

అవంతి కళాశాలలో పలు బ్రాంచిలకు పరిశోధన కేంద్రాలుగా గుర్తింపు

మాకవరపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో అవంతి కళాశాలలోని పలు బ్రాంచిలకు పరిశోధన కేంద్రాలు గుర్తింపు లభించాయని ప్రిన్సిపాల్ మోహనరావు తెలిపారు. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ శాఖలకు ఈ గుర్తింపు లభించిందని చెప్పారు. ఈ మేరకు గుర్తింపు ధ్రువపత్రాలను జేఎన్‌టీయూ విజయనగరం ఉప కులపతి వీవీ.సుబ్బారావు అందజేశారన్నారు. ఫలితంగా అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నత స్థాయి పరిశోధనలు చేయడానికి అవకాశం లభించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.



జేఎన్‌టీయూ వీసీ నుంచి గుర్తింపు పత్రాలను అందుకుంటున్న ప్రిన్సిపాల్

అట్టహాసంగా ప్రారంభించారు.. మధ్యలోనే వదిలేశారు!

- ఏఎల్ పురంలో అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో ముందుకు సాగని పనులు
- కోట్లాది రూపాయల వ్యయం.. నిరుపయోగం
- శిథిల భవనాల్లోనే ఉద్యోగుల విధులు.. పట్టని అధికారులు
- కూటమి ప్రభుత్వమైనా వినియోగంలోకి తేవాలని విన్నపాలు



తుది దశలో నిలిచిపోయిన సచివాలయం-2 భవనం

కృష్ణాదేవిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన కార్యాలయ భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. వైసీపీ పాలన ఐదేళ్లా



అసంపూర్తిగా ఉన్న ఏఎన్‌ఎం సబ్ సెంటర్ భవనం

పట్టించుకోకపోవడంతో తుప్పల మధ్య దర్శనమిస్తున్నాయి. దీంతో కోట్లాది రూపాయలు నిరుపయోగమయ్యాయి. గత్యంతరం లేక ఉద్యోగులు అద్దె భవనాల్లో చాలీచాలని వసతుల మధ్య విధులు నిర్వర్తిస్తున్నారు.

గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం పంచాయతీలో వైసీపీ పాలనలో నిర్మించిన ప్రభుత్వం భవనాలు అసంపూర్తిగా వదిలేశారు. ఈ భవన నిర్మాణాలను నాలుగేళ్ల ప్రారంభించినప్పటికీ, అప్పటి ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయకపోవటంతో నిర్మాణాలు నత్తనడక సాగాయి.

రెండేళ్ల క్రితం ఏఎల్ పురంలో రెండు సచివాలయాలు, రైతుల భరోసా కేంద్రాలు, ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఒక అంగన్‌వాడీ భవనం, ఇతర నిర్మాణాలకు అప్పటి ప్రభుత్వం సుమారు రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో అట్టహాసంగా ప్రారంభించిన ఆయా భవనాల నిర్మాణాలు చాలా వరకు పిల్లర్లతకే పరిమితమయ్యాయి. రెండు, మూడు భవనాలు శ్లాబు వేసి, ప్లాస్టింగులు చేసి వదిలేశారు. అలాగే రెండు సచివాలయాలకు ఒకటి భవనం పూర్తయింది. అయితే టైల్స్, ఫర్నిచర్, ఇతరత్రా చిన్న చిన్న పనులు పూర్తిచేయలేదు. మరొక సచివాలయ



శ్లాబ్ వేసి వదిలేసిన రైతు భరోసా భవన నిర్మాణం

భవనం శ్లాబ్‌కే పరిమితమైంది. రెండు రైతు భరోసా కేంద్రాల భవనాల్లో ఒకటి పిల్లర్లకే పరిమితం కాగా, మరొకటి శ్లాబ్ వేసి వదిలేశారు. అలాగే కమ్యూనిటీ హెల్త్ భవనం శ్లాబ్ వేయగా మరికొన్ని భవనాలు సగానికి పైగా చేసి అసంపూర్తిగా వదిలేశారు.

దీంతో సచివాలయం-1 సంబంధించిన ఉద్యోగులు పాత పంచాయతీ



అసంపూర్తిగా వదిలేసిన మరో రైతు భరోసా కేంద్ర భవనం చుట్టూ తుప్పలు

భవనంలోను, సచివాలయం-2 ఉద్యోగులు మూతబడిన శిథిలమైన ఎస్సీ బాలుర వసతి గృహంలోను విధులు నిర్వహిస్తున్నారు. దీనికితోడు అంగన్‌వాడీ, కమ్యూనిటీ హెల్త్‌భవనం పూర్తికాక అద్దె భవనాల్లో ఉద్యోగులు, అంగన్‌వాడీ చిన్నారులు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఈ భవనాలు అసంపూర్తిగా ఉండటంతో కొంతమంది యువతకు అసాంఘిక కార్యక్రమాలు నిలయంగా మారిపోయాయి.

దీనికితోడు వైసీపీ పాలనలో నాడు-నేడు నిధుల కొరతతో ప్రాథమిక



ఏఎల్ పురంలో శ్లాబ్‌కే పరిమితమైన సచివాలయం-1 భవనం

ఆరోగ్య కేంద్రం భవనం, ప్రభుత్వం జూనియర్ కళాశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులు కూడా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో విద్యార్థులు, వైద్య సిబ్బందికి రక్షణ కరువైందని, తల్లిదండ్రులు, రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు, ఉద్యోగులు కోరుతున్నారు.



శ్లాబ్ వేసి వదిలేసిన మరో ప్రభుత్వ కార్యాలయ భవనం

గొలుగొండలో పూర్తికాని సచివాలయ భవనం

గొలుగొండ: మండల కేంద్రంలో సచివాలయ భవన నిర్మాణం అసంపూర్తి నిలిచిపోయింది. దీంతో పాత పంచాయతీ భవనంలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనం వర్షాలకు కారిపోతున్నది. శ్లాబ్ పెచ్చులుడి శిథిలావస్థలకు చేరంది. దీంతో ఏ సమయంలో ఏం ప్రమాదం జరుగుతందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. త్వరితగతిన సచివాలయ భవనం అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు, ఉద్యోగులు కోరుతున్నారు.



తుది దశలో నిలిచిన సచివాలయ భవనం

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయండి

- పార్టీకి నష్టం కలిగిస్తే ఎంతటివారైనా సస్పెండ్ చేస్తా
- టీడీపీ కార్యాలయ ప్రారంభం కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు
- మాడుగులలో జనవరి 1న అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామని వెల్లడి

మాడుగుల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మండల కేంద్రంలో టీడీపీ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు నందారపు సన్యాసిరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో విజయానికి ప్రతి ఒక్కరూ కష్టపడాలని కోరారు. అలా కాకుండా గ్రూపు రాజకీయాలకు తెర లేపి పార్టీకి నష్టం కలిగించాలని చూస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. మండల నలుమూలల నుంచి వచ్చే ప్రతీ కార్యకర్త, నాయకులు కార్యాలయానికి వచ్చి సమస్యలను పట్టణ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణకు తెలపాలన్నారు. ఈ నెల 13వ తేదీ నాటికి మండల కమిటీలు వేసి ప్రమాణ స్వీకారాలు చేయించాలని ఆదేశించారు. ఎన్నికల సమయానికి ప్రభుత్వం అందించే పథకాలు ప్రజలకు అర్థమయ్యేల వివరించాలన్నారు. మాడుగుల పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పార్టీలో చురుకైన పాత్ర పోషించి ప్రతీ చోట సమావేశాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. ఆయన్ను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ థపథపాలుగా నెరవేర్చుతున్నామన్నారు. పాడేరు నుంచి పినగాడి వరకు వయా మాడుగుల మీదుగా రోడ్డు వెడల్పు చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే మాడుగుల దుర్గాలమ్మ ఆలయ సమీపంలో జనవరి 1వ తేదీన అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఏఎంసీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, మండల కార్యదర్శి పుప్పాల రమేశ్, పట్టణ కార్యదర్శి వడ్డాది గోపాలవర్మ, కింతలి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఉండూరు దేముడు తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ లైబ్రరీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బండారు

జమ్మాదేవిపేటలో డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

మాడుగుల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మాదేవిపేట గ్రామంలో శనివారం డిజిటల్ లైబ్రరీని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోసమాంబ రైతు నిర్మాణ కంపెనీ లిమిటెడ్ సీఈవో వడ్డి రాజ్ కుమార్ డిజిటల్ లైబ్రరీని గ్రామీణ ప్రాంత వాసులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ లైబ్రరీ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం మరింత పెంచుకునేందుకు తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, కూటమి నాయకులు ఎస్.సన్యాసిరావు, రమేశ్, దేముడు, అప్పారావు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన కాగితపు కళాకృతులు

నర్సీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాగితాలతో విద్యార్థులు తయారు చేసిన కళాకృతులు అబ్బురపరిచాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం కాగితాలతో కళాకృతుల పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ పోటీలకు వివిధ మండలాల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు హాజరయ్యారు. జూనియర్, సీనియర్ల విభాగాల్లో జరిగిన పోటీలలో కాగితాలు, రంగులు



కాగితాలతో కళాకృతులు తయారు చేస్తున్న చిన్నారులు





ఉపయోగించి చిన్నారుల చిట్టి చేతులతో తయారు చేసిన ఆకృతులు ఆకట్టుకున్నాయి. కలువ పువ్వుల మీద హంస, నెమలి, పువ్వులు, బొమ్మలు, ఇంటి డెకరేషన్‌ను పిల్లలు తయారు చేశారు. చిన్నారుల సృజనాత్మకతకు, నైపుణ్యానికి ఉపాధ్యాయులు సైతం ఆశ్చర్యపోయారు. ఈ నెల 14వ తేదీన విద్యార్థులు కాగితాలు, మట్టితో తయారు చేసిన కళాకృతుల ప్రదర్శన ఏర్పాటు చేస్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

నర్సీపట్నం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు జన సైనికులు సన్నద్ధం కావాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన నాలుగు మండలాల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులంతా క్రియాశీలకంగా పనిచేయాలని కోరారు. జనసేన సిద్ధాంతాలను, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి స్థానిక సంస్థలను కైవసం చేసుకోవాలని సూచించారు. పార్టీకి నష్టం కలిగించే పనులు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు పూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శులు సురేశ్, పంచాద హరినాథ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ ఇన్‌చార్జి వీర సూర్యచంద్ర

కరాటే విద్యను చిన్నచూపు చూడొద్దు

మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు పుల్లేటి గణేశ్

చోడవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరాటే విద్యను ప్రభుత్వాలు చిన్నచూపు చూడడం సరికాదని మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు, డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ పుల్లేటి గణేశ్ పేర్కొన్నారు. కొంత కాలంగా ప్రభుత్వం ఏటా వేసవిలో నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో కరాటేకు స్థానం కల్పించకుండా నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ఆత్మరక్షణ విద్యల్లో ప్రధానమైన కరాటేను ప్రోత్సహించే లక్ష్యంతో ఎంతో మంది క్రీడాకారులను కోచ్‌లు తీర్చిదిద్దుతున్నారన్నారు. అలాంటి కోచ్‌లను ప్రోత్సహించి పాఠశాలల్లో ఆత్మరక్షణ విద్యను నేర్పించే కార్యక్రమాలు అమలు చేయాలని ఆయన కోరారు. అలాగే రాష్ట్రంలో మార్షల్ ఆర్ట్స్‌కు ఉపయోగపడే రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షా ప్రాజెక్టును ఉత్తరాంధ్రలో నెలకొల్పితే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

రావికమతం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వైసీపీ నాయకులు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శనివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వైసీపీ మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మీనాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ తీరును ప్రశ్నించేందుకు, ప్రజల నిబద్ధతను నిరూపించేందుకే కోటి మంది ప్రజల అభిప్రాయాన్ని సంతకాల రూపంలో గవర్నర్‌కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, వైసీపీ మండల కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవా, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ స్వాధీనం

నాతవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెర్లోపాలెం ప్రభుత్వ భూమిలో కంకర, ఇసుకను అక్రమంగా తరలించడానికి ఉపయోగిస్తున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. తహశీల్దార్, వీఆర్వో ఇచ్చిన నివేదిక ఆధారంగా వీటిని స్వాధీనం చేసకున్నారు. యజమానులపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపుతామని తెలిపారు.

రుషికొండ భవనాన్ని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంగా మార్చాలి

దేవరాపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రుషికొండ భవన సముదాయాన్ని అంతర్జాతీయ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంగా మార్చాలని అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు కోరారు. 13,542 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రూ.451.67 కోట్లు ప్రజా ధనంతో నిర్మితమైన ఈ భవనం ఎలా వినియోగించాలంటూ ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేసిందన్నారు. అంబేడ్కర్ అంతర్జాతీయ స్మారక కేంద్రంగా మార్చి విద్యా, వైజ్ఞానిక, సాంకేతిక, సాంస్కృతిక, ప్రాచీన చరిత్ర ఆవశ్యకత ప్రపంచ వైజ్ఞానిక కళాఖండంగా రూపొందించాలని ఆయన కోరారు.

మద్యం దుకాణాల నిర్వాహకుల సమస్యలు పరిష్కరించరూ..

నర్సీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపు నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా వైన్ సిండికేట్ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. దుకాణాలు అద్దెలు, సిబ్బంది జీతాలతో మద్యం షాపులు నడపడం చాలా కష్టంగా ఉందని తెలిపారు. అందువల్ల ఎమ్మార్పీ మీద 20 శాతం మార్జిన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైన్ షాపుల సిండికేట్ అసోసియేషన్ కార్యదర్శి కె.కమల్, ఉపాధ్యక్షులు రవివర్మ, విజయ్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను జయించి...

» 58 ఏళ్ల వయసులో ఎవరెస్ట్ బేస్ క్యాంపు అధిరోహణ

» సత్తా చాటిన విశాఖ మహిళ


ఎవరెస్టు శిఖరంపై మున్నీ కైజరే

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరానికి చెందిన మున్నీ కైజరే అరుదైన ఘనతను సాధించారు. రొమ్ము క్యాన్సర్ బారినపడి కోలుకున్న ఆమె 58 ఏళ్ల వయసులో 18 వేల అడుగుల ఎత్తులో ఉండే ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించారు. ఎండాడ ప్రాంతానికి చెందిన మున్నీ టింపనీ స్కూల్‌లో టీచర్‌గా పనిచేశారు. ఆమె 2017లో రొమ్ము క్యాన్సర్ బారినపడ్డారు. సుమారు ఏడాదిన్నరపాటు క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించారు. ఆ తరువాత ఆరేళ్లకు కొందరు స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లారు. దానిని కొనసాగిస్తూ వచ్చారు. ఈ క్రమంలో పుణెకు చెందిన గిరి ప్రేమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరో ఐదుగురు మహిళలతో కలిసి గత నెల మూడో తేదీన ఎవరెస్ట్ పర్వతారోహణకు వెళ్లారు. 12వ తేదీ నాటికి బేస్ క్యాంపునకు చేరుకుని తిరిగి 17వ తేదీ నాటికి వెనక్కి వచ్చారు. మహిళలు చిన్నచిన్న సమస్యలకు కుంగిపోకుండా ధైర్యంగా ఉండాలని, ఆత్మస్థైర్యంతో ముందుకుసాగితే విజయాలను సాధించగలమని మున్నీ పేర్కొన్నారు.

ఇసుక మాఫియా

... 5వ పేజీ తరువాయి

ఇసుకను యథేచ్ఛగా తవ్వుకుని అమ్ముకున్నారు. ఇప్పుడు కూటమి పాలనలో ఆయా పార్టీల నేతల అండదండలతో అదే మాఫియా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నది. నదులు, గెడ్డల్లో ఇసుక తవ్వకాలు జరుపుతూ టన్ను రూ.600కు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ డిపోల్లోని ఇసుక కంటే తక్కువ ధరకు వస్తుండడంతో ఎక్కువ మంది భవన నిర్మాణదారులు స్థానిక ఇసుకనే కొనుగోలు చేస్తున్నారు.

'ఉచిత' వెసులుబాటు మాటున అక్రమాలు


ఇసుక స్టాక్ పాయింట్లకు దూరంగా వున్న గ్రామాల్లో నిర్మాణ పనులకు ఇసుక అవసరమైన వారు స్థానికంగా వున్న నదులు, గెడ్డల్లో నుంచి తవ్వి తీసుకెళ్లడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ వెసులుబాటును అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. రాజకీయ అండదండలతో సచివాలయాల సిబ్బందిని తమ గుప్పెట్లో పెట్టుకుని ఎడాపెడా అనుమతులు పొందుతున్నారు. నదుల్లో ఇసుక తవ్వకాలు జరుపుతూ దర్జాగా అమ్ముకుంటున్నారు. దీనిపై సంబంధిత శాఖల అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఇసుక స్టాక్ పాయింట్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొన్నిచోట్ల ఇసుక అమ్మకాలు ఆపేశారు. మరికొన్నిచోట్ల స్టాక్ పాయింట్లను స్థానిక నేతలకు అప్పగించేశారు. అనకాపల్లి స్టాక్ పాయింట్‌లో రోజుకు 10 నుంచి 20 లోడ్‌ల ఇసుక అమ్మకాలు జరిగేవి. అక్రమ తవ్వకందారులు ఇక్కడ కన్నా తక్కువ రేటుకు ఇసుక సరఫరా చేస్తుండడంతో ఈ కేంద్రంలో అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. చోడవరం మండలం నర్సాపురంలో ఏర్పాటు చేసిన ఇసుక నిల్వ కేంద్రంలో రోజుకు ఒక్క లోడు కూడా పోవడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో అధికార, విపక్ష నేతలు కుమ్మక్కై ఇసుక తవ్వకాలు జరిపిస్తుండడంతో గనులు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు కట్టడి చేయలేని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై గనుల శాఖ ఏడీ శ్రీనివాసరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఇసుక రీచ్‌లకు ఎక్కడా అనుమతి లేదన్నారు. అయితే పేదల ఇళ్ల నిర్మాణాలకు సమీపంలోని నదుల్లో నుంచి ఇసుక తవ్వి తీసుకెళ్లే వెసులుబాటు కల్పించిందన్నారు. నదుల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు.

నాగులాపల్లిలో శూలాల పండుగ రేపు

» శూలధారణతో మొక్కులు చెల్లించుకోవడానికి వీరశైవులు సన్నద్ధం

» ప్రత్యేక ఆకర్షణగా 1001 ఇనుప చువ్వల సుబ్రహ్మణ్య శూలం


ఆలయంలో శివలింగం


శూలాలను ధరించిన వీరశైవ భక్తుడు (ఫైల్ ఫొటో)

మునగపాక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులాపల్లిలో సాంబమూర్తి, పార్వతు శూలాల పండుగ ఈ నెల 10వ తేదీన భారీ ఎత్తున నిర్వహించడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. సుమారు రెండు శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ఏటా కార్తీకమాసం మూడో సోమవారం శూలాల సంబరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. సోమవారం తెల్లవారుజామున ఆలయంలో సాంబమూర్తి, పార్వతీదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు ప్రారంభం అవుతాయి. స్థానికులతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శివపార్వతులను దర్శించుకుంటారు. సాయంత్రం ఏడు గంటల నుంచి మొక్కు శూలాలు మొదలవుతాయి. 1001 ఇనుప చువ్వల సుబ్రహ్మణ్య శూలం, 516 ఇనుప చువ్వల శివ శూలం, 116 చువ్వలు కలిగిన శూలాలను వీర శైవులు ధరిస్తారన్నారు. పొట్ట, వీపు భాగాల్లో ఇనుప చువ్వలతో కూడిన శూలాలను గుచ్చుకోవడమే కాకుండా 508 ఇనుప మేకులతో కూడి పాదరక్షలను ధరిస్తారు. రంగురంగుల నూలు దారాలతో 15 రోజులపాటు శ్రమించి తయారు చేసే మూడు అంతస్థుల నూలు గుమ్మటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. శూలాల పండుగ సందర్భంగా గ్రామంలో పలుచోట్ల సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు మోరా రామేశ్వరరావు, కార్యదర్శి ఆండ్ర మల్లీశ్వరరావు తెలిపారు.


ఆలయం, శూలాల పండుగ చరిత్ర..

నాగులాపల్లి దేవాంగుల వీధిలో సుమారు 200 సంవత్సరాల క్రితం ఓంకార శబ్దం రావడం, అక్కడ భూమి పగిలి ఉండడంతో స్థానికులు తవ్వి చూడగా విభూది శివలింగం బయట పడిందని పెద్ద చెబుతుంటారు. అక్కడ కొబ్బరి మట్టలతో పందిర వేసి పూజలు చేయడంమొదలు పెట్టారు. 1858వ సంవత్సరంలో శారదా నది ఉప్పొంగడంతో పందిర కొట్టుకుపోయింది. కానీ విభూది శివలింగం చెక్కు చెదరలేదు. తరువాత ఉపాధి రీత్యా బర్మా (ప్రస్తుతం మయన్మార్) ప్రాంతానికి వలస వెళ్లిన దేవాంగులు.. అక్కడ జరిగే శూలాలు పండుగను చూసి, నాగులాపల్లిలో కూడా అదే తరహాలో నిర్వహించడం మొదలుపెట్టారు.

రాజయ్యపేటలో మళ్లీ పోలీసు బలగాలు


రాజయ్యపేట రహదారిపై పోలీసు బలగాలు

నక్కపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట మత్స్యకార గ్రామంలో మరోసారి పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. ఇటీవల తుఫాన్ పునరావాస భోజనాల విషయంలో కొందరు స్థానికులు గ్రామ సచివాలయంలో తనతోపాటు, సిబ్బందిని నిర్బంధించి దురుసుగా ప్రవర్తించి దౌర్జన్యం చేశారంటూ పంచాయతీ కార్యదర్శి కాకర సత్యం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై డీఎస్పీ విచారణ జరిపి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పిక్కి తాతీలు, పిక్కికోటి అలియాస్ రాంచరణ్‌పై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్టు చేశారు. ఈ పరిణామంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడకుండా వుండేందుకు ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలతో నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక సీఐ జె.మురళీ పర్యవేక్షణలో పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. ఇదే సమయంలో వైసీపీ నేత వీసం రామకృష్ణ, సీపీఎం నేత ఎం.అప్పలరాజు, తదితరులను గృహ నిర్బంధం చేశారు. కాగా బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేటలో మత్స్యకారుల నిరసన 56వ రోజుకు చేరుకుంది.



ముస్లింల సంక్షేమానికి పెద్ద పీట

» ప్రభుత్వ సలహాదారు షరీఫ్


మసీద్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ సలహాదారు షరీఫ్. పక్కన ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ప్రభుత్వ సలహాదారు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ అన్నారు. శనివారం ఉమ్మడి విశాఖ జిల్లాలో నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజాంలో నూతనంగా నిర్మించిన మజీద్‌ఏ జుబైర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ముస్లింలకు ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. షాదిఖానాలు, మసీదుల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు, నిధులు మంజూరు చేస్తుందన్నారు. తల్లికి వందనం వంటి పథకాలు ముస్లిం పిల్లల విద్యకు ఉపయోగపడతాయన్నారు. ప్రతి రోజూ ఐదు సార్లు నమాజ్ చేసి ఆధ్యాత్మిక చింతనతో దీన్ మార్గంలో పయనించాలన్నారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా సమాజానికి, దేశానికి సేవ చేయడానికి సిద్ధంగా ఉంటానన్నారు. ముస్లింల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. ఈ సందర్భంగా మసీద్ నిర్వహణకు రూ. లక్ష సొంత నిధులు ఇస్తానని ప్రకటించారు. స్టేట్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చింతూరుకు చెందిన ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ జమాల్‌ఖాన్ మసీదు నిర్వహణకు లక్ష విరాళం ప్రకటించారు. మిందికి చెందిన పారిశ్రామికవేత్త షేక్ సలీం ప్రతి నెలా మసీదు నిర్వహణకు రూ.10వేలు అందిస్తామన్నారు. ముస్లిం పెద్దలు షేక్ ఇస్మాయిల్ ,సుభాన్, ఖాన్ సాహెబ్, బాబ్జీ, ఇబ్రహీం, బాబర్, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ డి.నాగేశ్వరి దేవి, తహశీల్దార్ ఎం.లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి కోట సత్యనారాయణ, డీసీసీబీ మాజీ అధ్యకుడు కొరుకొండ రవి, సర్పంచ్ మరిశా నాని, మరిసా సతీశ్, మరిసా నరేశ్, వియ్యపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయాలు

... 5వ పేజీ తరువాయి

క్యాబేజీ, కాలీఫ్లవర్ తదితర కూరగాయల రేట్లు మండిపోతున్నాయి. ఇవన్నీ కిలో రూ.40కి తక్కువ లేవు. చిక్కుడు, బీన్స్ 'సెంచరీ' కొట్టాయి. బీర, బెండ, వంకాయలు కిలో రూ.60కి అమ్ముతున్నారు. ఇక ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యే క్యారెట్, బీట్‌రూట్ కిలో రూ.60కిపైనే వుంది. ఉల్లి, బంగాళాదుంపలు, టమాటా ధరలు ఒకింత స్థిరంగా వుండడం కొంత ఉపశమనం కలిగిస్తున్నది.

కానరాని ఆకు కూరలు

ఆకు కూరలు చాలా సున్నితమైన పంటలు. అధికవర్షాలను తట్టుకోలేవు. ఎక్కువ రోజులు వర్షం పడకపోయినా ఎండిపోతాయి. గత రెండున్నర నెలల నుంచి వర్షాలు అధికంగా కురుస్తుండడంతో ఆకు కూరల సాగు బాగాతగ్గిపోయింది. సాధారణంగా నవంబరు నుంచి ఆకు కూరలు మార్కెట్‌లో పుష్కలంగా లభిస్తాయి. దీంతో ధరలు తగ్గుతాయి. కానీ ఈ ఏడాది ఆగస్టు నుంచే ఆకు కూరల దిగుబడి తగ్గింది. సాధారణ ధరలతో పోలిస్తే రెట్టింపు అయ్యాయి. అయినాసరే నాణ్యమైన ఆకు కూరలు లభించడం లేదు.

నాసిరకంగా బడి భోజనం

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు చేసింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 246 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండారు. మెనూ ప్రకారం వైట్ రైస్, చారు, కూరగాయ కూర, తీపి పొంగలి, రాగి జావ పెట్టారు. చారుకి, నీళ్లకు తేడా లేకుండా వుందని, రుచీపచీ లేదని విద్యార్థులు చెబుతున్నారు. ఏ కూరగాయతో కూర వండారో చెప్పలేని విధంగా వుందని అన్నారు. ఈ రోజే కాదని.. నిత్యం ఇదే పరిస్థితి అని, కూరలు ఒక్క రోజు కూడా బాగుండడం లేదని వాపోయారు. చాలా మంది విద్యార్థులు అరకొరగా భోజనం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మధ్యాహ్న భోజనం పథకంలో పలు మార్పులు తీసుకువచ్చారు. పిల్లలకు రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారం పెట్టాలని అధికారులకు ఆదేశించారు. బడి భోజనానికి సన్న బియ్యం సరఫరా చేస్తున్నారు. కానీ భోజన పథకం నిర్వాహకులు మెనూను సక్రమంగా అమలు చేయడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉడికించిన కోడిగుడ్డును అన్నతోపాటు ప్లేటులో వడ్డించాలి. కానీ కోడిగుడ్లను పక్కన పెట్టి, పిల్లలను తీసుకోమంటున్నారు. చాలా మంది విద్యార్థులు భోజనం వడ్డించుకొని గుడ్డు వదిలేస్తున్నారు. వేరుశనగ చిక్కీలు కూడా స్వయంగా విద్యార్థులకు అందజేయడం లేదు. దీని వలన విద్యార్థులు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుతీరుపై పాఠశాల హెచ్‌ఎం (ఎంఈవో-1) తలుపులును వివరణ కోరగా.. భోజనం నిర్వాహకులకు చాలాసార్లు చెప్పామని, కానీ వారిలో మార్పు రావడం లేదని అన్నారు.

స్పీకర్ సంకల్పం.. రైతుల ఆనందం

... 5వ పేజీ తరువాయి

చేశారు. ఇటీవల నిర్మాణ పనులు పూర్తికావడంతో స్థానిక నాయకుల చేతుల మీదుగా ప్రారంభించారు. గిడుతూరు గ్రామానికి చెందిన పలువురు రైతులకు వరహా నది అవతల పొలాలు వున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులను ఇంటికి తీసుకు వచ్చేందుకు అనేక ఇబ్బందులు పడేవారు. స్పీకర్ కృషితో రోడ్డు నిర్మాణం కావడంతో తమ కష్టాలు తొలిగాయని రైతులు సంతోషిస్తున్నారు.

క్రైం... crime news

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య


పితాన స్వాతి (ఫైల్ ఫొటో)

సబ్బవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధి సాయినగర్ కాలనీలో వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి సీఐ జి.రామచంద్రరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. అచ్యుతాపురం మండలం నునపర్తి గ్రామానికి చెందిన పితాన చిరంజీవికి, భీమిలికి చెందిన స్వాతి (29)కి పుష్కర కాలం క్రితం వివాహం జరిగింది. అనంతరం భార్యాభర్తలు సబ్బవరం వచ్చి సాయినగర్ కాలనీలో స్థిరపడ్డారు. చిరంజీవి విశాఖ నగరంలోని మధురవాడలో ఒక గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా, స్వాతి సబ్బవరంలోనే బ్యూటీషియన్‌గా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే కొంతకాలం నుంచి భార్యాభర్తల మధ్య సఖ్యత లేదు. చిరంజీవి ఎక్కువ రోజులు మధురవాడలోనే వుంటూ అప్పుడప్పుడు సబ్బవరం వచ్చి వెళుతున్నాడు. స్వాతి తల్లి ఎర్ర వెంకయ్యమ్మ సబ్బవరంలో కుమార్తె వద్దనే వుంటూ, మనవళ్ల బాగోగులు చూసుకుంటున్నది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అల్లుడితో సఖ్యత ఉండమని ఆమె తరచూ చెబుతుండేది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి స్వాతి ఒక గదిలో నిద్రించగా, మనవళ్లతో వెంకయ్యమ్మ మరో గదిలో నిద్రించారు. వెంకయ్యమ్మ శనివారం ఉదయం నిద్ర లేచిన తరువాత స్వాతి పడుకున్న గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. వెంటనే స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ జి.రామచంద్రరావు సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి తరలించారు. స్వాతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

చెట్టు పైనుంచి జారి పడి యువకుడి మృతి


ముత్యాల శ్రీను (ఫైల్‌ఫొటో)

బుచ్చెయ్యపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఉదయం పొట్టిదొరపాలెం గ్రామంలో కొబ్బరి చెట్టు పైనుంచి జారిపడి ముత్యాలు శ్రీను(43) మృతి చెందాడు. ఈయన వడ్డాది రెల్లివీధికి చెందిన వ్యక్తి. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పాయకరావుపేట రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నామవరం పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇందుకు సంబంధించి సీఐ జి.అప్పన్న వెల్లడించిన వివరాలు... నామవరం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ (33) శుక్రవారం అర్ధరాత్రి పాయకరావుపేట నుంచి నామవరం వైపు మోటారు సైకిల్‌పై వెళుతున్నాడు. నామవరం వద్ద పెట్రోల్ బంక్‌లో నుంచి జాతీయ రహదారిపైకి ఆకస్మికంగా లారీ వచ్చింది. దీంతో లారీని బలంగా ఢీకొని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని నక్కపల్లి సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ పురుషోత్తం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొలేరో వ్యాన్ చోరీ

పాయకరావుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌రోడ్డులో పార్కింగ్ చేసిన బొలేరో వ్యాన్‌ను శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. వాహనం యజమాని కేజీఎస్ సత్యనారాయణ, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయి ఉత్సవ్ పక్కన, దొర చికెన్ సెంటర్ ఎదుట రోడ్డు పక్కన శుక్రవారం రాత్రి బొలేరో వాహనాన్ని పార్కింగ్ చేశారు. శనివారం ఉదయం చూస్తే కనిపించలేదు. దీంతో బొలేరో వ్యాన్‌ను తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పది కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

గొలుగొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై పది కిలోల గంజాయిని తరలిస్తున్న యువకుడిని గొలుగొండ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్ఐ రామారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ముందుగా అందిన సమాచారం మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాలతో మండలంలోని చిన్నయ్యపాలెం గ్రామ శివార్లలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో కృష్ణాదేవిపేట వైపు నుంచి నంబరు ప్లేటు లేని బైక్‌పై వస్తున్న వ్యక్తిని ఆపి సోదాలు చేయగా.. పది కిలోల గంజాయి లభ్యమైంది. ఇతను మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాకు చెందిన ఆకాశ్ బౌరవ్ గౌరేగా గుర్తించారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.

మెగాసిటీగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

జాతీయ రహదారిని తాకదు. రాంబిల్లిలో మొదలై అనకాపల్లి, కొత్తవలస మీదుగా భోగాపురాన్ని కలుస్తుంది. దీని పొడవు సుమారుగా 90 కి.మీ. ఉంటుందని అంచనా.

విశాఖపట్నంలో ఉపాధి అవకాశాలు భారీగా లభించే ఐటీ, పర్యాటక ప్రాజెక్టులు అనేకం వస్తున్నాయి. ఆనందపురం మండలంలో గూగుల్ డేటా సెంటర్, మధురవాడలో అదానీ, సిఫీ డేటా సెంటర్లు రానున్నాయి. భోగాపురం సమీపాన ఐటీ సిటీ వంటివి ప్లాన్ చేస్తున్నారు. అదేవిధంగా విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్‌లో పర్యాటక ప్రాజెక్టులు అనేకం వస్తున్నాయి. విశాఖ నుంచి ఆనందపురం మీదుగా అనేక పేరొందిన విద్యా సంస్థలు ఐఐఎం, అనిట్స్, గాయత్రి, అవంతి, రఘు ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ఇవన్నీ ఈ మెగాసిటీకి గ్రోత్ ఇంజన్లుగా ఉపకరిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

25 ఏళ్లలో శ్రీకాకుళం కూడా కలుస్తుంది

పీవీఎన్ మాధవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వం అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం ఒక స్ట్రిప్ కింద అభివృద్ధి చేయాలని భావిస్తోంది. అందులో భాగంగానే సెమీ రింగ్ రోడ్డు ప్రతిపాదించారు. ఇది ఎంతవరకు ఉపయోగపడుతుందనే దానిపై చర్చలు జరుగుతున్నాయి. రాబోయే 25 ఏళ్లలో శ్రీకాకుళం కూడా వీటితో కలిసిపోనుంది.

త్వరలో అధునాతన వైద్యం

... 5వ పేజీ తరువాయి

అందించడానికి అత్యాధునిక పరికరాలతో 'క్లిష్టతర వ్యాధుల సంరక్షణ విభాగాన్ని' అందుబాటులోకి తీసుకురానున్నారు. వాస్తవంగా క్రిటికల్ కేర్ బ్లాక్ గత ప్రభుత్వ హయాంలోనే మంజూరుకాగా.. పనులు చాలా మందకొడిగా సాగాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులు వేగవంతం చేయించారు. భవన పనులు చాలా వరకు పూర్తయ్యాయి. ఆధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేసిన వెంటనే దీనిని ప్రారంభిస్తారని తెలిసింది. సీసీబీ సేవలు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా.. కాంట్రాక్టర్ అన్ని పనులు పూర్తిచేసి ఈ నెలాఖరుకు భవనాన్ని అప్పగిస్తారని చెప్పారు. అధునాతన వైద్య పరికరాలు వస్తున్నాయని, కాంట్రాక్టర్ భవనం అప్పగించిన వెంటనే వీటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీలైనంత త్వరగా రోగులకు సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589